## సరస్వతి పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం

## పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది



మృతులకు ప్రధాని మోడీ నివాళులు

2

గుంటూరు - గురువారం 23 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 108 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

# పెట్టుబడులే లక్ష్యం

### జర్మనీలో పర్యటిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా



**కర్నూలు ఏప్రిల్ 22మనం న్యూస్ :** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా జర్మనీలో పర్యటిస్తున్నారు. ఏపీకి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఆయన పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఫ్రాంక్‌ఫర్ట్‌లో వస్త్ర పరిశ్రమ మరియు సాంకేతిక ఆవిష్కరణలలో భారతదేశపు బలాన్ని ప్రదర్శిస్తూ ఇండియా పెవిలియన్ను మంత్రి ప్రారంభించారు. అనంతరం సౌరర్, కార్ల్ మేయర్, ఆండ్రిట్జ్, మాన్ఫోర్ట్స్, ట్రూట్జ్లర్ వంటి కంపెనీలతో సహా, టెక్స్టైల్ మెషినరీ, రసాయనాలు మరియు అధునాతన తయారీ రంగాలలోని ప్రపంచ పారిశ్రామిక నాయకులతో ఫలవంతమైన సంభాషణలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ను ప్రపంచ టెక్స్టైల్ టెక్నికల్ టెక్స్టైల్స్ కేంద్రంగా నిలబెట్టేందుకు సహకారం కోసం మెస్సే ఫ్రాంక్‌ఫర్ట్ నాయకత్వంతో మంత్రి చర్చించారు. ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏపీలో ఏ రంగంలో అయినా పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం నుండి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని చెప్పారు. భారత్-జర్మన్ పారిశ్రామిక మరియు సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో, కీలకమైన పలు కార్యక్రమాలతో జర్మనీలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు, ఏఐ మరియు పారిశ్రామిక భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు భారత కాన్సులేట్ జనరల్ మరియు ప్రపంచ పారిశ్రామిక నాయకులతో మంత్రి టీజీ భరత్ గుప్తా సమావేశమయ్యారు.




### 2026-27లో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను

# తయారు చేయడమే లక్ష్యం

### ఎస్.హెచ్.జి (ఖిఏఎ) సభ్యులందరికీ బీమా భరోసా – సెర్ప్ కీలక నిర్ణయాలు

**అమరావతి, ఏప్రిల్ 22,(మనం ప్రతినిధి) :** 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని సెర్ప్ రాష్ట్ర కార్యాలయంలో సెర్ప్ కార్యక్రమాల అమలుపై జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామస్థాయిలో ఈనారిలు, వీవోఏల ద్వారా ప్రతి సంఘ సభ్యురాలు చేపట్టబోయే జీవనోపాధి కార్యక్రమ వివరాలు, దానికి అవసరమైన పెట్టుబడి వివరాలు సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి ఎంఎస్ఎంఈ యూనిట్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి చేయూత ఇచ్చేలా ప్రణాళిక రచించాలని మంత్రి సూచించారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడిని బ్యాంకులు స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ మరియు పీఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ ద్వారా సమకూర్చేలా వార్షిక రుణ మరియు పెట్టుబడి ప్రణాళిక తయారు చేయాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఖిఉఖ్ఖ), స్వయం సహాయక సంఘాల (ఖిఏఎ) సభ్యులు , వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన' (క్ఖఒఒఖ్ఖ), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన' (క్ఖిఖ్ఖ) మరింత వేగంగా అమలు చేయాలని ప్రస్తుతం గ్రామ సంఘాల సహాయకులు నమోదు చేస్తున్న డేటాలో స్పష్టత పెంచేందుకు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి నుంచి అధికారిక సమాచారాన్ని సేకరించి సెర్ప్ పోర్టల్లో అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. ఈ ప్రక్రియలో బీమా గురించి పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సభ్యులు



### ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి

## నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత

**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా హైదరాబాద్లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. గురువారం ఆయన అంత్యక్రియలు పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యు లు తెలిపారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984లో నెల రోజులపాటు ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేశారు. ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య హయాంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

**చంద్రబాబు సంతాపం..**

నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. భాస్కర రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను సీఎం ఫోన్లో పరామర్శించారు.

**ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.. పవన్**

నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారని, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని అన్నారు. ఆయన కుమారుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ పితృవియోగ బాధ నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మాజీ సీఎం నాదెండ్లకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘన నివాళి



**హైదరాబాద్,అమరావతి, ఏప్రిల్,22,మనం న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా నివాళులు అర్పించారు. నాదెండ్ల భాస్కరరావు మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటీన హైదరాబాద్ చేరుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నాదెండ్ల స్వగృహంలో భాస్కరరావు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి, జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను పరామర్శించారు. నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి



**అమరావతి,ఏప్రిల్, 22,(మనం న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. స్వర్గీయ నాదెండ్ల భాస్కరరావు అపార రాజకీయ అనుభవం

## రాంబిల్లిలో రెన్యూవబుల్ విప్లవం

### రూ.5,400 కోట్లతో రెన్యూబుల్ ఎనర్జీ గ్లోబల్

### 2,100 మందికి ఉపాధి కల్పించేలా ఎనర్జీ ప్లాంట్

### నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 22 (మనం ప్రత్యేక ప్రతినిధి) :** పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పేరు మరోసారి మార్మోగనుంది. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక వర్గాల్లో అనకాపల్లి జిల్లాపై జరిగిన చర్చ... ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు రానుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెడుతున్న క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆ రంగానికి హై ప్రయార్టీ ఇస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలకు పెద్ద ...మిగతా 2లో



### అభివృద్ధిని పట్టించుకోని

# వైసీపీని నిలదీయండి

### రూ 4.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నిమ్మల

**పాలకొల్లు, ఏప్రిల్ 22,మనం ప్రతినిధి :** పాలకొల్లు నియోజకవర్గంలో గత వైసిపి ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదని, ఆ పార్టీ నాయకులు మీ వద్దకు వస్తే ఎందుకు చేయలేకపోయారని నిలదీయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు, ...మిగతా 2లో

# ఆదివాసీలకు అద్భుత అవకాశం

### పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం 'రివర్స్ టూరిజం'

### 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించిన జూపల్లి

### 250 మంది అడవి బిడ్డలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి



**ఉట్నూరు, ఏప్రిల్ 22:** రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, ...మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు

- టెహ్రాన్ ఒక ప్రతిపాదనతో వచ్చేవరకు దాడులు చేయం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏక పక్ష ప్రకటన



**వాషింగ్టన్, ఏప్రిల్ 22 :** ఇరాన్ తో రెండోవిడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతుండగానే... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. పాకిస్థాన్ అభ్యర్థన ...మిగతా 2లో

## రెండు రాష్ట్రాల్లో నేడు పోలింగ్

- తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు.. బెంగాల్‌లో తొలి విడత 152 స్థానాల్లో ఓటింగ్



**చెన్నై, ఏప్రిల్ 22 :** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు అంతా రెడీ అయింది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ ...మిగతా 2లో

## బాలల హక్కుల పరిరక్షణలో కమిషన్‌కు పూర్తిస్థాయి సహకారం అందిస్తాం

- మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**అమరావతి, ఏప్రిల్,22,(మనం ప్రతినిధి) :** బాలల హక్కుల పరిరక్షణలోకమిషన్కు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామనిమహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యులు మంత్రిని బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు సభ్యులు పి నాగ మానస, కేజీ పద్మలత, మందాల గంగ సూర్యనారాయణ, చల్ల మధుసూదనరావులను మంత్రికి పరిచయం చేశారు. ...మిగతా 2లో



# సరస్వతి పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 22, 2026 : దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంతరావు బుధవారం లోక్ భవన్లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి పీపీటీ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు-వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ధీశాలి అని కొనియాడారు. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని గుర్తు చేసుకున్నారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయన చూపిన పరిపాలనా దక్షత, ప్రభుత్వ యంత్రాంగంపై ఆయనకున్న పట్టు అమోఘమని మంత్రి అన్నారు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శిగా నాదెండ్ల భాస్కరరావు నిలిచారన్నారు.చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉందని, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా నుంచి సామాన్యంగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో బలమైన ముద్ర వేసే వరకు సాగడం స్ఫూర్తిదాయకమని అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి కందుల దుర్గేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోనిబ్బరాన్ని ప్రసాదించాలని, మరణించిన భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.

# ఆదివాసీలకు అద్భుత అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు.

**ఆదివాసీలతో మమేకమైన మంత్రి**

కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**నగర నాగరికతకు – సంస్కృతికి వారధి**

ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

# పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది

## మృతులకు ప్రధాని మోడీ నివాళులు

ఢిల్లీ, ఏప్రిల్ 22 : జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాదైంది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోడీ నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ..'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.

పహల్గామ్‌లో ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని కలచివేసిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ విషాదాన్ని, ఇందులో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఆ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలోనూ దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎప్పటికీ సఫలం కావన్నారు. కాగా.. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేశారు. హిందువులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ప్రపంచమంతా తీవ్రంగా ఖండించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల క్యాంపులను నేలమట్టం చేసింది.

# రెండు రాష్ట్రాల్లో నేడు పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)



తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది.

**పశ్చిమ బెంగాల్లో 152 స్థానాల్లో..**

పశ్చిమబెంగాల్లో తొలి విడతకు సర్వం సిద్ధమైంది. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది.

# అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ట్రూత్ సోషల్లో పోస్టు పెట్టారు.

అమెరికా- ఇరాన్ మధ్య ఈనెల 8న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల విరమణ ముగియడానికి కొన్ని గంటల ముందు దీన్ని పొడిగిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ ల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సంఘర్షణ ముగించేందుకు ఇరాన్ ఒక ప్రతిపాదనతో ముందుకు వచ్చేవరకు దానిపై దాడులు చేయమన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇరాన్లోని అంతర్గత కలహాలే తదుపరి చర్చలు విఫలమవడానికి కారణమని ఈసందర్భంగా ట్రంప్ ఆరోపించారు. ఇక, తమ అభ్యర్థన మేరకు కాల్పుల విరమణను పొడిగించినందుకు ట్రంపునకు పాక్ ప్రధాని షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కొనసాగుతోన్న దౌత్య ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇది వీలు కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## 2026-27లో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను

# తయారు చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మృతిచెందినప్పుడు అవగాహన లేక కుటుంబాలు క్లెయిమ్ పొందలేకపోతున్నాయన్నారు. ఇకపై ఎవరైనా సభ్యులు మృతిచెందితే గ్రామసంఘం ప్రతినిధులు, విఓఏ వెంటనే ఆ ఇంటిని సందర్శించి బ్యాంకులో క్లెయిమ్ దరఖాస్తు చేసి ఆ కుటుంబానికి సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీమా ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా సెర్ప్ ప్రత్యేక ప్రామాణిక విధానం రూపొందించి క్లెయిమ్ పొజిషన్ పర్యవేక్షించాలని మంత్రి తెలిపారు. ఈ పద్ధతిలో ప్రతి పేద కుటుంబానికి బీమా రక్షణ కల్పించడంతో పాటు ఆపదలో వారికి ఆర్థికంగా అండగా నిలవాలని మంత్రి సూచించారు. ఎన్పీఎస్ లైట్ - స్వావలంబన్ పథకంలో సభ్యులుగా ఉండి, 60 ఏళ్లు నిండిన చందాదారులకు పెన్షన్ నిధుల రీఫండ్ వేగంగా ఇచ్చేలా చూడాలని మంత్రి సెర్ప్ విఓల సూచించారు. గత సంవత్సరం లక్ష్యాలు సాధించి సెర్ప్ సిబ్బందిని మంత్రి అభినందించారు. వార్షిక రుణ మరియు పెట్టుబడి ప్రణాళిక పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో సెర్ప్ సెక్రటరీ సీఈవో వాకాటి అరుణ, అడిషనల్ సీఈవో శ్రీరాములు నాయుడు, స్త్రీ నిధి ఎండి హరిప్రసాద్, ఇతర డైరెక్టర్లు, అడిషనల్ డీపీఎంలు, స్త్రీ నిధి డీజీఎంలు పాల్గొన్నారు.

# రాంబిల్లిలో రెన్యూవబుల్ విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

పీట వేస్తోంది. ఈ క్రమంలో రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి... ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

## అభివృద్ధిని పట్టించుకోని

# వైసీపీని నిలదీయండి

(మొదటి పేజీ తరువాయి)

యలమంచిలి మండలాల్లోని నేరేడుమిల్లి, రావుపాడు, వద్దిపర్రు కే ఎస్ పాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల గ్రామాల్లో ఇరిగేషన్ నిధులు రూ 4.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో మండుటెండను సైతం లెక్కచేయకుండా మోటార్ సైకిల్ పై పర్యటిస్తూ ప్రజా సమస్యల ఆలకిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మంత్రి నిమ్మలకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా దొడ్డిపట్ల గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకొల్లు నియోజకవర్గంలో పాటు ఆరు గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. గత వైసిపి ప్రభుత్వం లో ఇటువంటి అభివృద్ధి జరగలేదని కేవలం ఆ పార్టీ నాయకులు జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, టిటిడి బోర్డు సభ్యుడు, డీసీఎంఎస్ చైర్మన్ వంటి పదవులను అనుభవించారే గాని ప్రజల ఆలోచన లేదన్నారు. తాళాలు ఇచ్చే కార్యక్రమంలో ఎమ్మెల్యేగా పాల్గొంటే నన్ను వేదికపై నుంచి గెంటేయడంతో పాటు దాడి చేసి బటన్ కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన అరాచక నైజం వైసీపీ శ్రేణులదన్నారు. రాష్ట్రంలో జగన్ గొడ్డలి పార్టీ హింసను రెచ్చగొడుతూ రఫా రఫా అంటూ నరుకుతామని, చంపుతామని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అటువంటి పార్టీ అధికారంలోకి వస్తే భావితరాల పిల్లల భవిష్యత్తు ఉండదన్నారు. అటువంటి గొడ్డలి పార్టీని శాశ్వతంగా సమాధి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి , సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ మంచి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల కోరారు.సభలో కూటమి నాయకులు బోనం నాని, బొప్పన హరి కిషోర్, పెన్మెత్స రామ భద్ర రాజు,,యు కబర్ది, బోనం శ్రీరామ కృష్ణ, డేగల సత్యనారాయణ,చెగొండి రవిశంకర్,మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపి,తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పట్లో చర్చలు లేనట్లే..

## జేడీ వాన్స్ బృందం పాక్ పర్యటన వాయిదా..!



వాషింగ్టన్, ఏప్రిల్ 22: అమెరికా- ఇరాన్ మధ్య ఇప్పట్లో చర్చలు జరిగే సూచనలు కన్పించట్లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్ పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. సంప్రదింపులకు సంబంధించి ఇరాన్ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. వైట్‌హౌస్ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడుతున్నాయి.

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగియడానికి ముందే.. చర్చల కోసం జేడీ వాన్స్ బృందం ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సిఉంది. అయితే, చర్చలకు సంబంధించి ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. మరోవైపు తమ నౌకలపై విధించిన దిగ్బంధనం ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామని ఇరాన్ గతంలో తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే వాన్స్ నేతృత్వంలోని బృందం పాక్ పర్యటన వాయిదా పడినట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే, ఇది పూర్తిగా రద్దు కాలేదని, కేవలం వాయిదా మాత్రమేనని స్పష్టంచేశాయి. వాన్స్ బృందం ఎప్పుడైనా పాక్ పర్యటనకు బయలుదేరవచ్చని వెల్లడించాయి.

ఇస్లామాబాద్‌కు తమ ప్రతినిధి బృందాన్ని పంపాలా, వద్దా అనే దానిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనం, వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకోవడం గురించి ఆయన ప్రస్తావించారు. ఈ చర్యల కారణంగా చర్చల్లో వాషింగ్టన్ చిత్తశుద్ధిపై ఆయన అనుమానం వ్యక్తంచేశారు. మరోవైపు.. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఒక ప్రణాళికతో ఆ దేశం ముందుకువచ్చేవరకు ఇది కొనసాగుతోందన్నారు. అయితే, హర్మూజ్ వద్ద తమ దిగ్బంధనం మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

# చమురే ఖర్గ్ ద్వీపాన్ని ముంచేస్తుంది

- **అమెరికా మంత్రి హెచ్చరికలు**



వాషింగ్టన్, ఏప్రిల్ 22: ఇరాన్ మెడలు వంచి.. దాన్ని ఎలాగైనా ఒప్పందంలోకి తీసుకురావాలని అమెరికా గట్టిగా ప్రయత్నిస్తోంది. దాన్ని ఆర్థికంగా మరింత ఇబ్బందిపెట్టేందుకు.. హర్మూజ్ దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. దానిని ఉద్దేశించి అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులు ఆగిపోయి.. ఖర్గ్ ద్వీపం నిల్వలతో నిండిపోతుందన్నారు.

పర్షియన్ గల్ఫ్‌లో ఒక చిన్న ద్వీపమైన ఈ ఖర్గ్.. ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైనది. ఇక్కడినుంచే దాదాపు 90 శాతం ఎగుమతులను ఇరాన్ నిర్వహిస్తోంది. ఈ దిగ్బంధనం నేపథ్యంలో ఆ దేశ చమురు ఎగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై బెసెంట్ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్ ఓడరేవులపై యూఎస్ దిగ్బంధనం కొనసాగుతోందని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టంచేశారు. దీంతో కొన్ని రోజుల్లోనే ఖర్గ్ ద్వీపంలోని చమురు స్టోరేజీ ట్యాంకులు నిండిపోతాయి. కీలకమైన ఇరాన్ చమురు బావులు మూతపడతాయి. దీంతో ఆ దేశ ప్రధాన ఆదాయానికి గండి పడనుంది' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా టెహ్రాన్ ఆర్థిక సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు యూఎస్ ట్రెజరీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఇరాన్‌తో రహస్య వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులు, నౌకలు యూఎస్ ఆంక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**ఇరాన్ ఆర్థికంగా కుప్పకూలుతోంది: ట్రంప్**

ఇరాన్ ఆర్థికవ్యవస్థపై ట్రంప్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. అది ఆర్థికంగా కుప్పకూలుతోందన్నారు. నగదు కొరతతో టెహ్రాన్ అల్లాడిపోతోందంటూ ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. తమ దిగ్బంధనంతో రోజుకి 500 మిలియన్ డాలర్లు ఇరాన్ కోల్పోతోందని.. దీంతో హర్మూజ్ జలసంధిని అది తెరవాలనుకుంటుందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా తమకు జీతాలు అందడం లేదంటూ ఇరాన్ సైన్యం, పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# సగానికి పడిపోయిన క్షిపణుల నిల్వలు

- **ఆందోళనలో అగ్రరాజ్యం**
- **ఇరాన్ సైనిక సామర్థ్యంతో ఉంది**
- **పెంటగాన్ నిఘా విభాగం**

వాషింగ్టన్, ఏప్రిల్ 22: ఆయతుల్లా ఖమేనీని అంతం చేయడంతో ఇరాన్లో పాలన కూలిపోతుందని అమెరికా వేసిన అంచనాలు తలకిందులు కావడంతో ఇరాన్‌తో సుదీర్ఘంగా యుద్ధం నడుస్తోంది. దీంతో కీలక క్షిపణుల నిల్వలు క్షీణిస్తుండటం అగ్రరాజ్యాన్ని కలవరానికి గురిచేస్తోంది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. పేట్రియాట్, థాడ్ ఇంటర్సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయాయి. తోమహాక్ క్షిపణి నిల్వలు కూడా 35 శాతం మేర ఆవిరయ్యాయని పేర్కొన్నాయి. ప్రిసిషన్ స్ట్రైక్ మిస్సైళ్ల నిల్వలో 45 శాతం కంటే ఎక్కువ వాడారు. ఈ స్థాయి వినియోగం అమెరికా సైనిక సన్నద్ధతలో లోపాలను ఎత్తి చూపుతోందని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. స్వల్పవ్యవధిలో సైనిక కార్యకలాపాలకు ఈ నిల్వలతో ఢోకా లేనప్పటికీ.. మరే ప్రాంతంలో భారీ ఘర్షణలో పాల్గొనాల్సి వస్తే ఈ ఆయుధ నిల్వలపైనే ఆధారపడే పరిస్థితి లేదన్నారు. అదే సమయంలో ఇరాన్ కీలక సైనిక సామర్థ్యాలను కలిగి ఉందని పెంటగాన్ నిఘా విభాగం అంచనావేసింది. ఇటీవల ఆపరేషన్ తర్వాత కూడా ప్రాంతీయ శక్తిగా మిగిలే ఉందని పేర్కొంది. ఆ దేశ సైనిక సామర్థ్యాలను భారీగా దెబ్బతీశామని ట్రంప్ యంత్రాంగం చేస్తోన్న ప్రకటనలకు ఈ అంచనాలు భిన్నంగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్ కంటే డొనాల్ ట్రంప్‌నకే ఒప్పందం ఎక్కువ అవసరంగా కనిపిస్తోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# వర్సిటీలకు సాంకేతిక పరిజ్ఞానం కీలకం

## అంబేద్కర్ వర్సిటీలో ఉన్నతవిద్య.. డిజిటల్ పరివర్తన సదస్సులో ప్రవీణ్ ప్రకాష్

హైదరాబాద్, మనం ప్రతినిధి : విశ్వవిద్యాలయాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. అంబేద్కర్ వర్సిటీలో బుధవారం ఉన్నత విద్యలో డిజిటల్ పరివర్తన అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా క్రెడిట్ ఆధారిత ఆన్‌లైన్ కోర్సుల కోసం స్వయం వేదికను ఏర్పాటు చేసారని, ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాలు సొంతంగా పూర్తి ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారని, అదేవిధంగా యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండే లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులకు విద్యను అందించడానికి సంపూర్ణ అధ్యయన వేదికలను ఏర్పాటు చేసుకున్నారన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో కమిషన్‌కు పూర్తిస్థాయి సహకారం అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం అడగలేని బాలల తరపున కమిషన్ నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం బాలల సంక్షేమానికి, హక్కుల రక్షణకు ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. కమిషన్ విధి నిర్వహణకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సాయం అందిస్తామన్నారు. ఈ భేటీలో శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సూర్య కుమారి, కమిషన్ సెక్రటరీ ఉమాదేవి పాల్గొన్నారు.

# హర్మూజ్ దిగ్బంధించామంటున్న ట్రంప్ మాటలు ఉత్తుత్తివేనా?

టెహ్రాన్, ఏప్రిల్ 22 : హర్మూజ్ జలసంధిని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకున్నామని, దిగ్బంధన వ్యూహం 'సూపర్ సక్సెస్' అయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అయితే, అక్కడి వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దాదాపు 900 మిలియన్ డాలర్లకు పైగా విలువైన చమురుతో కూడిన 34 ఇరాన్ సంబంధిత ట్యాంకర్లు హర్మూజ్ను దాటి వెళ్లినట్లు తెలిపాయి. వీటిలో 19 ట్యాంకర్లు ఇరాన్కు చెందినవి కాగా.. మిగిలిన 15 నౌకలు అరేబియా సముద్రం నుంచి ఇరాన్ వైపుగా గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. హర్మూజ్ను దాటి వెళ్లిన 6 నౌకల్లో ఇరాన్ ముడిచమురు రవాణా చేసినట్లు సమాచారం.

ఏప్రిల్ 13న హర్మూజ్ దిగ్బంధనానికి అమెరికా పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇరాన్ పోర్టులకు నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ప్రకటించింది. ఈ మేరకు తన నేవీని రంగంలోకి దించింది. పరిమిత దేశాలకు చెందిన నౌకలను మాత్రమే అనుమతించేలా చర్యలు చేపట్టింది. అయితే, కొన్ని అంతర్జాతీయ కథనాల ప్రకారం.. ఇప్పటివరకు అమెరికా దళాలు కేవలం ఒక్క నౌకను మాత్రమే అడ్డుకోగా.. ఇండో-పసిఫిక్లో ఆంక్షలకు గురైన మరో ట్యాంకర్ను తనిఖీ చేసినట్లు చెబుతున్నాయి. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన దీనికి విరుద్ధంగా ఉంది. మొత్తం 28 నౌకలను ఇరాన్ పోర్టులకు వెళ్లనీయకుండా వెనక్కి తిప్పి పంపినట్లు సెంట్రల్ కమాండ్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

# డబ్బులిస్తే ఏమైనా చేస్తాం

## లేని సర్వే నెంబర్లు సృష్టిస్తాం

## ముగ్గురు తహసీల్దార్లకు నోటసులు

## చిత్తూరు జిల్లాలో తాహాశిల్దార్ల నిర్వాకం

చిత్తూరు ఎప్రిల్ 22 మనం న్యూస్: లేని సర్వే నంబర్లను సృష్టించి, భూములు లేకున్నా వాటకి విస్తీర్ణం జతచేసి ఏకంగా రైతుల పేరుతో అక్రమంగా వెబ్ల్యాండ్లోకే ఎక్కించేసిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు సిద్ధమవుతోంది. సిద్ధమవుతోంది. ఒకే మండలంలో పనిచేసిన ముగ్గురు తహసీల్దార్ల భాగోతంపై ప్రభుత్వం మంగళవారం నోటీసులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా ఎస్ఆర్పురం మండలంలో గతంలో పనిచేసిన ముగ్గురు తహసీల్దార్ల నిర్వాకాల గురించి తమ సంజాయిషీలను 10 రోజుల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఈ నోటీసుల్లో ప్రభుత్వం ఆదేశించించి. ఈ మండలంలో గతంలో పనిచేసిన ఆర్.వెంకటలక్ష్మమ్మ, వి.శ్రీనివాసులు, ఎన్.ఎం.గుర్రప్ప చేసిన అక్రమాలను ప్రభుత్వం కూలంకషంగా వివరించింది. ఎస్.ఆర్.పురం మండలం వేణుగోపాలపురంలో సర్వే నెంబరు 190/1లో 1.45 ఎకరాలు జి.గోవింద రెడ్డి పేరుతో వెబ్ల్యాండ్లో నమోదు చేశారు. మరో సర్వే నెంబరు 191లో 3.87 ఎకరాలు బి.ఉమాపతి రెడ్డి పేరుతో ఎక్కించారు. అసలు ఈ గ్రామంలో చివరి సర్వే నంబరు 188. దీంతో పై మూడు సర్వే నంబర్లు బోగ్సగా గుర్తించారు. అదే విధంగా తాటిమాకులపల్లెలో 424/1 లో 3.75 ఎకరాలు బి.లత (భర్త రాజారెడ్డి) పేరుతో నమోదు చేశారు. ఈ గ్రామంలో చివరి సర్వే నెంబరు 416. ఆపైన సర్వే నంబర్లు లేవు. అదే గ్రామంలో 429/2ఏలో 1.96 ఎకరాలు బి.రేణుక (భర్త రఘునాథ రెడ్డి) పేరుతోనూ, 447లో 4.89 ఎకరాలు బి.వేణునాయుడు పేరుతో వెబ్ల్యాండ్లో నమోదు చేశారు. ఇవే గాకుండా వేణుగోపాలపురం గ్రామంలో కోదండ రెడ్డి పేరును సర్వే నంబర్లు లేకుండానే డీకేటీ రిజిస్టరులో నమోదు చేశారు.

ఇదే గ్రామంలో 159 నంబరులో 3.41 ఎకరాలకు ఎలాంటి పాత అడంగళ్ల ఆధారాలు లేవు. దీనికి సంబంధించిన భూమి కూడా క్షేత్రస్థాయిలో ఎక్కడా లేదు. ఇక్కడే పి.చిన్నబీదమ్మ (భర్త రఘునాథ రెడ్డి) పేరుతో 189/1 నంబరులో 4.10 ఎకరాలు వెబ్ల్యాండ్కు ఎక్కించారు. ఇక్కడ కూడా 188 నంబరుతో సర్వే నంబర్లు ముగుస్తున్నాయి. తాటిమాకులపల్లె గ్రామంలో బి.ఈశ్వరి (భర్త నరసింహ రెడ్డి) పేరుతో 429 స.నెం.లో 3.67 ఎకరాలు అక్రమంగా నమోదు చేశారు. మాంగుంట గ్రామంలో కె.చంద్రకళ (భర్త బాలాజీనాయుడు) పేరుతో స.నెం.190/1లో 2.75 ఎకరాలు, 190/2లో 1.25 ఎకరాలు కూడా అక్రమంగా వెబ్ల్యాండ్లోకి ఎక్కించారు. అసలు ఈ గ్రామంలోని చివరి సర్వే నంబరు 176తో ముగుస్తోంది. ఇదే గ్రామంలో కె.ప్రక్షాబాబు పేరుతో 199/1లో 3.75 ఎకరాలు, 199/2లో 1.0 ఎకరా, బాలాజీనాయుడు పేరుతో 193/1లో 2.70 ఎకరాలు, 193/2లో 2.0 ఎకరాలు నమోదయ్యాయి. తహసీల్దార్లు ఆర్.వెంకటలక్ష్మమ్మ, వి.శ్రీనివాసులు, ఎన్.ఎం.గుర్రప్ప ఈ అక్రమాలకు పాల్పడ్డట్లు విచారణలో తేలడంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ముగ్గురికీ విడివిడిగా సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. అవసరమైన ఆధారాలన్నీ నోటీసులకు జత చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్సీ వెంటనే ప్రకటించాలి

- నెలలోపు 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలి
- కేంద్ర మాజీ మంత్రి, చింతామోహన్ డిమాండ్

మదనపల్లె, ఏప్రిల్22మనం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్సీ వెంటనే ప్రకటించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు ఆరు లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీళ్లకు 30 వేల కోట్ల రూపాయలు బకాయిలు రావాల్సి ఉందన్నారు. నెల రోజులలోపు ఉద్యోగస్తులకు బకాయిలు చెల్లించాలని కోరారు. గత 8 సంవత్సరాలుగా పిఆర్సీ పెయింటింగ్ లో ఉందన్నారు. 1958లో బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వం పిఆర్సీ ని మొట్టమొదటిసారిగా అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పిఆర్సీ వేయాల్సి ఉండగా, ఎనిమిదేళ్లుగా పెండింగ్ లో ఉందన్నారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు తీరని నష్టం జరిగిందన్నారు.

లక్షల కోట్ల రూపాయలు అమరావతిపై ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పి ఆర్ సి ని ప్రకటించడంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 6 మంది మంత్రులను వినోదయాత్రలకు సింగపూర్ కు పంపించారని, ప్రజాధనాన్ని వృధా చేశారని మండిపడ్డారు. కష్టపడి పని చేస్తున్న ఉద్యోగస్తులకు పెన్షన్లు, వారికి రావాల్సిన ఇతర బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. లక్షల మంది ఉద్యోగులు తమ బిడ్డలను




చదివించలేకపోతున్నారని, ధరలు బాగా పెరిగిపోయాయని, మూడు రూపాయలకు వడ్డీలకు తెచ్చి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అమరావతిని చంద్రావతి అని అందరూ అనుకుంటున్నారు. రాయలసీమలో తిరుపతి రాజధాని కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. అమరావతి ఫెయిలవుతుందని, తిరుపతి రాజధాని తప్పక అవుతుందని చింతామోహన్ స్పష్టం చేశారు. అమరావతి రైతులకు తాను సున్నితంగా తెలియజేస్తున్నానని, చంద్రబాబు మాటలను నమ్మొద్దన్నారు. స్వామి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఎప్పుడో 300 సంవత్సరాల క్రితం తన తాళ్ళపాక గ్రంథాల్లో తిరుపతి రాజధాని గురించి ప్రస్తావించారని, అది నిజమవుతుందని చింతామోహన్ ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లె ప్రాంతంలో టమోటా రైతులు, చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా, మామిడి రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్, ప్రముఖ దళిత నాయకులు యమలా సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు సమీఉల్లా, మీనా కుమారి, ముబారక్ ఖాన్, ఖాదర్ బాషా, మహబూబ్ ఫీర్, శరత్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ నాయక్, మహమ్మద్ అలీ, ఆర్ నాగరాజ, పాలేటి, బి. నాగరాజ, ఈశ్వరమ్మ, గంగులప్ప, బయ్యా రెడ్డి, ఖాసిం వల్లి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ కార్మికులకు పునరావాసం కల్పించిన జిల్లా కలెక్టర్

తిరుపతి, ఏప్రిల్ 22మనం న్యూస్: తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, లేబర్ శాఖల అధికారుల సమన్వయంతో తిరుపతి గ్రామీణ ప్రాంతంలోని పలు ప్రదేశాలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లో 60 మంది వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించి సురక్షితంగా రక్షించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కుటుంబాలు పుదిపట్ల గ్రామంలోని ఇటుక బట్టీలో ఐదు నెలలుగా పనిచేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి రూ.45,000 అడ్వాన్స్ ఇచ్చి వారానికి కేవలం రూ.1,000 చెల్లిస్తూ, వారిని బానిసలుగా చేసుకుంటున్నారు. ఇటుక బట్టీల యాజమాన్యం కార్మికులను తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, కలెక్టర్ తక్షణమే వ్యూహాన్ని మార్చి రెవెన్యూ, కార్మిక



శాఖ అధికారులు, డీఎస్పీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసుల బృందాలను పంపి కార్మికులను ట్రేస్ చేసి సురక్షితంగా కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. మహిళలు, పిల్లలతో సహా మిగిలిన వారిని గుర్తించి రక్షించి ఆహారం, ఆశ్రయం, భద్రత వంటి తక్షణ సహాయాన్ని అందించారు. రక్షించబడిన కార్మికులకు బుధవారం విడుదల సర్టిఫికెట్లు జారీ చేసి, పునరావాసానికి అర్హత కల్పించి, అనంతరం సురక్షితంగా రైలు ద్వారా ఒడిస్సాకు తరలించారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం, 1976 ప్రకారం విచారణ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. బట్టి యజమానులు,వారి అనుచరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించారు. ఇటువంటి కార్మికులను గుర్తించి రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, రెవెన్యూ, పోలీస్, కార్మిక శాఖ, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఏప్రిల్22మనంన్యూస్: ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను మంగళవారం ఆదేశించారు. కదిరి మున్సిపల్ కార్యాలయంలో కదిరి నియోజకవర్గంలోని అధికారులతో బుధవారం ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ:- కదిరి నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా విధి నిర్వహణలో అకింతభావంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది పనితీరు కూడా మెరుగు పర్చుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలన్నారు. కదిరి నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు మరింత మెరుగైన వసతి సదుపాయాలు

- పిఏసి-1, ఆస్థాన మండపాల ఆధునీకరణ
- శ్రీవారి సేవ వ్యవస్థ బలోపేతం
- భక్తుల అభిప్రాయాలతో సేవల మెరుగుదల
- టిటిడి ఇఓ రవిచంద్ర



తిరుపతి, ఏప్రిల్ 22 మనం న్యూస్: శ్రీవారి దర్శనార్థం తిరుమల, తిరుపతికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన వసతి సదుపాయాలు కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని టిటిడి ఈవో ఎం. రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు.ప్రతిరోజూ వేలాదిగా వచ్చే భక్తులకు ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడం లేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా తిరుపతిలో వసతి సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు,ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారీ చేయాలని ఆదేశించారు.భక్తుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు.తిరుమలలో నెయ్యి నిల్వ ట్యాంకులు, ముడి సరుకుల గోదాముల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త గోదాములు నిర్మించాలని, పెండింగ్ వ్యర్థాలను త్వరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఏసి-1, ఆస్థాన మండపాలను ఆధునికీకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇతర ఆలయాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్వో డా. టి.రవికి సూచించారు. భవిష్యత్తులో వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్వేర్ నిపుణుల సేవలను వినియోగించుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.ఈ సమావేశంలో టిటిడి కళ్యాణ మండపాల నిర్వహణ, ఎస్వీబీసీ, స్విమ్స్, ఎఫ్ ఎం ఎస్, వసతి గృహాలు, ఎస్ ఎస్ డి, ఎస్ ఈ డీ, శ్రీవాణి దర్శనం టికెట్ల జారీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎం.శరత్, సివిఎస్వో కె.వి.మురళీకృష్ణ, సీఈ టి వి సత్యనారాయణ, అడిషనల్ ఎఫ్.ఏ.సి.ఏ.వో రవిప్రసాద్, ఇంఛార్జి లా ఆఫీసర్ వెంకట సుబ్బానాయుడు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంబించిన మంత్రి



రేణిగుంట, ఏప్రిల్ 22 మనం న్యూస్: శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నేడు రేణిగుంట మండలం, తూకివాకం గ్రామంలో సుమారు రూ.76.89 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కే.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఇంధన శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ ఘనంగా ప్రారంభించారు. మన నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు మరియు కంపెనీలు ఉన్న నేపథ్యంలో, లో-వోల్టేజ్ సమస్యలు లేకుండా విద్యుత్ సరఫరా మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగా, శ్రీకాళహస్తి నియోజకవర్గానికి మరిన్ని సబ్-స్టేషన్లు మరియు విద్యుత్ కేంద్రాలను మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి ని కోరడం జరిగింది. ఈ సబ్-స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల రైతులకు, పరిశ్రమలకు మరియు సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. అభివృద్ధి పనుల కోసం నిరంతరం సహకరిస్తున్న మంత్రులకు మరియు అధికారులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరాతోనే పారిశ్రామిక అభివృద్ధి

- పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- విద్యుత్ ఛార్జీలను తగ్గించిన తరువాతే సాధారణ ఎన్నికలకు వెళ్తాం
- శ్రీసిటీ పారిశ్రామికవేత్తలతో ఇష్టాగోష్టిలో మంత్రి గొట్టిపాటి
- రాయలసీమ జిల్లాల్లో త్వరలో రూ.250 కోట్లతో 65 సబ్ స్టేషన్లు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



సత్యవేడు/శ్రీకాళహస్తి ఏఫ్రిల్ 22మనం న్యూస్: నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా తోనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు వాటికి అవసరమైన సరిపడా విద్యుత్ ను అందిస్తోందని తెలిపారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఉమ్మడి చిత్తూరు జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం నాడు ముందుగా సత్యవేడు నియోజకవర్గంలోని రాచెర్ల సబ్ స్టేషన్ ప్రారంభించారు. శ్రీసిటీలో పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాచెర్ల సబ్ స్టేషన్ తో శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతానికి ఇకపై లో ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు ఉండవని స్పష్టం చేశారు. శ్రీసిటీలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వ మద్దతు ఉంటుందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో దేశంలోనే ప్రసిద్ధ పారిశ్రామిక హబ్గా శ్రీసిటీ అభివృద్ధి చెందుతుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

### 31 దేశాల పారిశ్రామికవేత్తల పెట్టుబడులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమలు స్థాపించడానికి ఎంతోమంది ముందుకు వస్తున్నారని ఇంధన మంత్రి గొట్టిపాటి తెలిపారు. గత రెండేళ్లలో శ్రీసిటీలో వచ్చిన కొత్త పరిశ్రమలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రస్తుతం 31 దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టారని, తద్వారా 70 వేల మందికి పైగా ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో శ్రీసిటీ ద్వారా సుమారు 1.50 లక్షల మందికి ప్రత్యక్షంగానే ఉపాధి లభిస్తుందని మంత్రి వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం విద్యుత్ రాయితీలను ఇస్తోందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే తొలిసారిగా విద్యుత్ ఛార్జీలను 'ట్రూ డౌన్' చేశామని గుర్తుచేశారు. ట్రూ అప్ అనేది లేకుండా వచ్చే ఎన్నికలకు ముందే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామన్నారు. ఛార్జీలను తగ్గించే తాము ఎన్నికలకు వెళ్తామన్నారు. విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి మద్దతు కావాలన్నా అందిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. శ్రీసిటీకి కొత్త సబ్ స్టేషన్ కేటాయించడంపై పారిశ్రామికవేత్తలు మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఆదిశంకరాచార్యుల జయంతి వేడకలు

ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 22 మనం న్యూస్: ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజారి ధనుంజయఆచారి ఆధ్వర్యంలో శంకరాచార్యులకు ప్రత్యేక చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూజారి ధనుంజయఆచారి మాట్లాడుతూ శంకరాచార్యులు జీవించింది 32 ఏళ్లు మాత్రమే అయినా విశ్వగురువుగా ఖ్యాతి పొందారన్నారు. మహనీయుడు నడిచే దైవం ఆదిశంకరాచార్యులన్నారు. తన బోధనలతో అశేష జనావళిని ఆధ్యాత్మికంగా జాగృతం చేసి, సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన జగద్గురువులు ఆదిశంకరాచార్యులన్నారు.

# మాతృ, శిశు మరణాల పై నిర్లక్ష్యం వద్దు



- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్


అనంతపురం, కలెక్టరేట్ ఏప్రిల్ 22: మనం న్యూస్: జిల్లాలో ఎక్కడ కూడా మాతృ శిశు మరణాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వాటిపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లాకలెక్టర్ ఓ.ఆనంద్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వైద్యఆరోగ్యశాఖఆధ్వర్యంలో మాతృ మరణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరణాలు సంభవించకుండా ప్రజల ప్రాణాల రక్షణ కోసం వైద్యాధికారులు, సిబ్బంది తగినంతగా కృషి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో తాడిపత్రి మరియు గుంతకల్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు గర్భిణీ మాతృ మరణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్య అధికారులతో నివేదిక వివరాలనువిచారణరూపంలోఅడిగి తెలుసుకున్నారు.

అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరణాల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. ప్రసవ సమయ కాలంలో ఖచ్చితంగా డ్యూటీ డాక్టర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. ప్రతి తల్లి ,ప్రతి శిశువు ప్రాణం ఎంతో విలువైనదని బాధ్యతగా గుర్తుంచు కోవాలన్నారు. ప్రసవాలన్నీ ప్రభుత్వ లేదా అధికృత ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని తద్వారా మరణాలు తగ్గించవచ్చునని కలెక్టర్ సూచించారు.

# కోటి 20 లక్షలతో శ్రీలక్ష్మి సమేత చెన్న కేశవ స్వామిఆలయం జీర్ణోద్ధరణ

పీలేరు ఏప్రిల్ 22 మనం న్యూస్: పీలేరు నియోజకవర్గం గుండ్లూరు శ్రీ లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి అతి పురాతనమైన ప్రాచీనమైన ఆలయ జీర్ణవర్ధరణ కార్యక్రమాలకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషన్ కుమార్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఆర్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి రామిరెడ్డి 24 లక్షలు విరాళంతో ఎండోమెంట్ కోటి రూపాయలు కోటి 20 లక్షలతో బాలాలయ స్థాపన ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం బుధవారం వేదమంత్రోచ్చరణ మేళ తాళాలు డప్పు వాయిద్యాలు మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు అనంతరం ఎమ్మెల్యే నల్లారి కిషన్ కుమార్ రెడ్డికి పురోహితులు పూర్ణకుంభంతో



స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జీర్ణోద్ధరణ కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి పురాతనమైన ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయం గుండ్లూరులో పూజలు అందుకోవడం సంతోషంగా ఉందని ఆలయ జీర్ణోద్ధరణకు దాతలు ఎండోమెంట్ ముందుకు రావడం, ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషదాయకమని ఆలయానికి విరాళాలు ఇవ్వడం గొప్ప విషయమని ఈ ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం జరిగినప్పుడు

ఈ ఆలయ నిర్మాణం జరిగిందని చారిత్రక ఆధారాలు చెప్తాయని రానురాను ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇప్పుడు మళ్లీ ఆలయానికి పూర్వవైభవం తేవడం గొప్ప వరం అని అన్నారు. ఆలయానికి విరాళాలు ఇచ్చిన వేణుగోపాల్ రెడ్డి, రామిరెడ్డి, ఆర్ ఎస్ ఆర్ రెడ్డిని దుశ్శాలవాలతో సన్మానించి వారిని అభినందించారు. స్థానికులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గుండ్లూరులో చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయం జీర్ణోదరణ జరగడం దానికి దాతలు ఎండోమెంట్ సహకారం అందించడం ఆలయం ఒకటిన్నర సంవత్సరం లోపు పూర్తి చేస్తారని గుత్తేదారులు సహదేవ రెడ్డి చెప్పడం సంతోషమని అలాగే అన్ని మతాలు కోరుకునేది మానవత్వమేనని మంచి గుణాలను మంచి ఆలోచనలని మతాలు వేరైనా మనుషులంతా ఒకటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మంజుల, మురళీనాథరెడ్డి, మాజీ సర్పంచ్ సైపుల్ల మల్లికార్జున, వెంకటరమణ, రాజా ఉమ్మడి కూటమి నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam



## ఎండజల్లు

ఎడతెరిపి లేకుండా
కురుస్తోంది ఎండ
ఏ ఎండకా గొడుగేమోకానీ
ఏ గొడుగు పట్టినా
నిలువ నీడలేకుండా
చేస్తోందీ ఎండ

ఎండ కురవని చోటంటూ లేదు
డాబాల్లో వుంటే
మాడిన పెనంలాగా మండించి
మసి చేస్తోంది

గుడెసెల్లో వుంటే
చిల్లులగుండా కురిసి
నిప్పుల వానలా
మీద దాడిచేస్తోంది

చెట్టొక్కటే ఈ ఎండ జల్లును
నిలువరించే ఆయుధమని
వెతకుతూ పోతే
చెట్టు ఆచూకీ ఎక్కడా దొరక్క
ఎండ చినుకులతో
బొబ్బలెక్కిన దేహంతో
తిరిగి రావాల్సి వస్తుంది

వానలా కురుస్తున్న ఈ ఎండ
ఎప్పుడాగుతుందో తెలియదుగానీ
మనిషి చేసిన ఘనకార్యాలకు
మండగొడుతోందీ ఎండ

ఈ ఎండజల్లు తగ్గేదెపుడో
మళ్లీ మనుషులుగా మనం
తడి తడిగా విరబూసేదెపుడో

**- చిత్తలూరి**
9133832246

**ఎడిట్ పేజీ కోసం**
**మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**

**– ఎడిటర్**

# ఆశలు - అసంతృప్తి మధ్య నవ తెలంగాణ



తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఒక కీలక దశలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు పెట్టుకున్న ఆశలు, ఇప్పుడు నెమ్మదిగా ప్రశ్నలుగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన వాగ్దానాలను అమలు చేస్తుందనే నమ్మకం ఒక వైపు సడలిపోతుంటే, మరోవైపు రాజకీయ అస్థిరత సంకేతాలు కనిపిస్తున్నాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను విడిచి బీఆర్ఎస్‌లో చేరడం వంటి పరిణామాలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. అంతర్గత అసంతృప్తి ఇంకా ముగియలేదనే సంకేతాలిస్తున్నాయి. అదే సమయంలో కల్వకుంట్ల కవిత ప్రకటించబోయే కొత్త పార్టీ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.


రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ప్రకటించిన 'ఆరు గ్యారంటీలు' ప్రజల్లో భారీ ఆశలు కలిగించాయి. కానీ ఆ హామీల అమలు అనుకున్నంత అద్భుతమేం కాదని తేలిపోయింది. ఏదో కొంతవరకు చర్యలు కనిపిస్తున్నప్పటికీ, స్పష్టత, వేగం లోపించిందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి వర్గాలు ఈ పథకాలు తమ జీవితాల్లో నిజంగానే మార్పులు తెస్తాయని ఆశపడ్డారు. రాజకీయాల్లో వాగ్దానాలు చేయడం చాలా సులభం, కానీ వాటిని స్థిరంగా అమలు చేయడం కష్టం. అదే పరీక్ష ఇప్పుడు రేవంత్ సర్కార్ ఎదుర్కొంటోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 'హైడ్రా'(HYDRAA),'మూసీ ప్రక్షాళన' అంశాలు రాజకీయంగా, సామాజికంగా పెను దుమారం రేపుతున్నాయి. వెలుగుమట్ల వంటి చోట్ల జరిగిన సంఘటనల నుండి మూసీ పరివాహక ప్రాంతాల వరకు పేదల ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వానికి పరిపాలనాపరమైన అవసరంగా అనిపించవచ్చు. చెరువుల పునరుద్ధరణ, నదీ ప్రక్షాళన వంటివి పర్యావరణపరంగా అవసరమే అయినప్పటికీ, దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న సామాన్య ప్రజల ఆవేదనను విస్మరించడం సమంజసం కాదు. స్పష్టమైన పునరావాస ప్యాకేజీలు, మానవీయ కోణం లేని ఇటువంటి చర్యలు ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతున్నాయి. అభివృద్ధి అనేది ప్రజల కన్నీళ్ల మీద కాకుండా, వారి నమ్మకం మీద నిర్మించబడాలి. లేకపోతే, ఈ కూల్చివేతలు భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది. ఒక్కసారి గనక విశ్వాసం దెబ్బతింటే తిరిగి పొందడం చాలాకష్టం.

తెలంగాణ రాజకీయాల్లో మైనారిటీల ఓట్లు, ముఖ్యంగా ముస్లింల ఓటు ఎప్పటికప్పుడు కీలక పాత్ర పోషిస్తూ వచ్చింది. ఇటీవలి ఎన్నికల్లో కూడా ముస్లింలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో, వారి సమస్యలు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పడుతుందనే ఆశలు వ్యక్తమయ్యాయి.

అయితే కాలక్రమేణా ఆ ఆశలు ఎంతవరకు నెరవేరుతున్నా యన్న ప్రశ్నలు వినిపించడం ప్రారంభమైంది. కొన్ని వర్గాల్లో మైనారిటీల సమస్యలకు ఆశించిన ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అజహరుద్దీన్ పదవీకాలం ముగింపు కూడా ఒక సంకేతంగా చర్చకు వస్తోంది. మైనారిటీ రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితమవుతున్నాయా?లేక నిజంగానే వారి అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు మరింత స్పష్టంగా ముందుకు వస్తోంది.

ఇక జీవన్ రెడ్డి పార్టీ మార్పు ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు, ఒక పెద్ద రాజకీయ సంకేతం. ఇది కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత సమస్యలను బయటపెడుతోంది.



ఒక సీనియర్ నాయకుడు పార్టీని విడిచి వెళ్లడం అంటే, ఆ పార్టీలోని నాయకత్వం, విధానాలపై అసంతృప్తి ఉన్నట్లు భావించవచ్చు. జీవన్‌రెడ్డి అదేమీ దాచుకోలేదు, బహిరంగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించాడు. ఇలాంటి పరిణామాలు ప్రత్యర్థి పార్టీలకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి, అధికార పార్టీకి మాత్రం కొత్త సమస్యలు సృష్టిస్తాయి.

ఈ నేపథ్యంలో కవిత ఎంచుకున్న రాజకీయ దారి ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆమె కొత్త పార్టీ ఆత్మగౌరవం, సామాజిక తెలంగాణ ఆలోచనలపై ఆధారపడుతుందని, ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్తుందని చెబుతున్నారు. యువత, మహిళలు, బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఒక కొత్త సామాజిక సమీకరణను నిర్మించాలనే ప్రయత్నం కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ అంశం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న సమయంలో, దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం ఒక వ్యూహాత్మక నిర్ణయం.

కవిత స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసి నాయకత్వాన్ని నిరూపించుకోవాలనే స్థిర నిర్ణయంతో ఉన్నారు. అయితే కొత్త పార్టీ స్థాపనతోనే విజయం సాధ్యం కాదు. తెలంగాణలో గతంలో కూడా కొత్త పార్టీలు వచ్చాయి. జయప్రకాశ్ నారాయణ స్థాపించిన లోక్‌సత్తా పార్టీ, విజయశాంతి తల్లి తెలంగాణ, వైఎస్ షర్మిల నెలకొల్పిన వైఎస్ఆర్‌టీపీ పార్టీ - ఈ ప్రయత్నాలు మొదట ఆశలు రేపినా, తరువాత నిలబడలేకపోయాయి. కారణం స్పష్టమే, బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం, నిరంతర ప్రజా సంబంధాలు లేకపోవడం, నియతృత్వ ధోరణులు ఇలా కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. కవిత పార్టీ కూడా ఇదే పరీక్షను ఎదుర్కొంటుంది.

ఇప్పుడు ప్రధానంగా తలెత్తుతున్న ప్రశ్న ఏమిటంటే, తెలంగాణలో కొత్త పార్టీకి స్థలం ఉందా? ఉంది, కానీ అది ఖాళీగా లేదు. ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ, వారు ఇప్పటికిప్పుడు ఎవరినైనా వెంటనే అంగీకరించే స్థితిలో లేరు. కొత్త పార్టీకి బలమైన సైద్ధాంతిక భూమిక, స్పష్టమైన విధానం, క్రమబద్ధమైన కార్యాచరణ, స్థిరమైన నాయకత్వం అవసరం. భావోద్వేగాలతో మాత్రమే రాజకీయాలు నడవవు. పనితీరు కూడా అవసరం.

రాష్ట్రంలో నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉండటం అసంతృప్తిని పెంచుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, స్థానికులకు అవకాశాలు కల్పించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. ఈ సమస్యలను ఎవరు సమర్థంగా పరిష్కరిస్తారో వారికి మాత్రమే ప్రజల మద్దతు లభిస్తుంది.

ఇక భారతీయ జనతా పార్టీ తన ఉనికిని నిలబెట్టుకుంటూ బలం పెంచుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే దాని రాజకీయ విధానంపై ప్రజల్లో అనుమానాలు, విమర్శలు ఉన్నాయి.

విభజనాత్మక, మతరాజకీయాలపై తీవ్రమైన అభ్యంతరాలున్నాయి. భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న ఈ మత రాజకీయాలు తాత్కాలిక లాభాలు కలిగించవచ్చు, కానీ దీర్ఘకాలంలో సామాజిక సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే సమగ్రత, చర్చ, సమన్వయం ఆధారిత రాజకీయాలు అవసరం.

ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన సమస్య ప్రభుత్వంపై నమ్మకం లోపించడం. ప్రభుత్వ ప్రకటనలు, ఆచరణల మధ్య వ్యత్యాసం కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యుత్, విద్య, ఉపాధి వంటి అనేక ప్రాథమిక సమస్యలు ఇంకా సమస్యలుగానే ఉన్నాయి. ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కాకపోవడం ఈ అనుమానాలను మరింత పెంచుతోంది.

విద్యా రంగంలో ఫీజుల పెరుగుదల మరో కీలక సమస్య. ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచుతుండగా, ప్రజల ఆదాయం అంతగా పెరగడం లేదు. ప్రభుత్వం దీనిపై కట్టడి చేయకపోతే, ఇది పెద్ద సామాజిక అసమానతకు దారి తీస్తుంది. విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం అత్యంత అవసరం.

మరో ముఖ్యమైన విషయం, పరిపాలనలో పారదర్శకత. ప్రజలు ఇప్పుడు కేవలం పథకాలు కాదు, వాటి అమలు ఎలా జరుగుతుందో కూడా చూస్తున్నారు. నిర్ణయాలు పారదర్శకంగా లేకపోతే, అవి ప్రజల్లో అనుమానాలను పెంచుతాయి. పాలనలో బాధ్యతాయుత ధోరణి లేకపోతే, ప్రజల విశ్వాసం కోల్పోతుంది.

మొత్తం మీద చూస్తే, తెలంగాణ రాజకీయాలు ఒక కొత్త దిశలో ప్రయాణిస్తున్నాయి. ప్రజలు ఇప్పుడు బాగా ఆలోచిస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు. ఎవరు నిజంగా పని చేస్తున్నారు? ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారు? అనే అవగాహనతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది ఒక ఆరోగ్యకరమైన మార్పు.

మొత్తంమీద, తెలంగాణ భవిష్యత్తు ఇప్పుడు మూడు అంశాలపై ఆధారపడి ఉంది, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్ష బాధ్యత, కొత్త రాజకీయ శక్తుల నిజాయితీ. ఈ మూడు తమ తమ పాత్రలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తేనే రాష్ట్రం ముందుకు సాగుతుంది. లేకపోతే ఈ రాజకీయ హడావిడి తాత్కాలికంగానే మిగిలిపోతుంది.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

# ఉద్యోగులకు పే రివిజన్ ఎప్పుడో..?

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పథంలో ఉద్యోగుల పాత్ర అనన్యసామాన్యం. ప్రభుత్వ రంగం, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, విద్యుత్ వంటి కీలక విభాగాలు సమర్థవంతంగా నడవడానికి వారి కృషి మూలాధారం. అయితే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మరియు జీవన వ్యయాల పెరుగుదల నేపథ్యంలో ఉద్యోగుల ఆర్థిక స్థితి గణనీయంగా ఒత్తిడికి లోనవుతోంది. ఇటీవలి గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సాధారణ ద్రవ్యోల్బణం సుమారు 4.5 నుంచి 5 శాతం మధ్య ఉండగా, ఆహార ద్రవ్యోల్బణం 6 శాతం దాటింది. 2020 నుండి 2026 వరకు మొత్తం ద్రవ్యోల్బణం 25-30 శాతం వరకు పెరిగినప్పటికీ, వేతన సవరణలు మరియు డీఏ పెంపులు కలిపి కేవలం 14-16 శాతం వరకు మాత్రమే ఉపశమనాన్ని కల్పించాయి. ఫలితంగా ఉద్యోగుల వాస్తవ ఆదాయం తగ్గి, వారి కొనుగోలు శక్తి బలహీనపడింది.

ఇక జీవన వ్యయాల పెరుగుదల పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఇళ్ల అద్దెలు 15-20 శాతం వరకు పెరగగా, ఆహార పదార్థాలు, విద్య, ఆరోగ్య ఖర్చులు నిరంతరంగా అధికమవుతున్నాయి. ఇంధన ధరలు, పన్నులు, సేవల ఛార్జీలు కూడా కుటుంబ బడ్జెట్‌పై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక సాధారణ మధ్యతరగతి ఉద్యోగి తన నెలవారీ అవసరాలను నిర్వహించడం సవాలుగా మారింది. ఇదే సమయంలో ప్రైవేట్ రంగంలో ఉద్యోగులకు ప్రతి సంవత్సరం 8-12 శాతం వేతన పెంపులు, ప్రోత్సాహకాలు లభిస్తుండగా, ప్రభుత్వ ఉద్యోగులు నాలుగేళ్లకోసారి వేతన సవరణపై ఆధారపడాల్సి వస్తోంది. అది కూడా తరచూ 1 నుంచి 3 సంవత్సరాల ఆలస్యంతో అమలవుతుండడం సమస్యను మరింత తీవ్రము చేస్తోంది.

ఈ ఆలస్యాల ప్రభావం కేవలం వేతనాలపైనే కాకుండా ఉద్యోగుల జీవన ప్రమాణాలపై కూడా ప్రతికూలంగా పడుతోంది. పెరుగుతున్న ఖర్చులను తట్టుకోలేక అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఉద్యోగుల్లో ఉత్సాహం తగ్గి, పనితీరు దెబ్బతింటోంది. కుటుంబ భద్రత, పిల్లల విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు కూడా ప్రభావితమవుతున్నాయి. దీర్ఘకాలికంగా చూస్తే, ఇది ప్రతిభావంతులైన సిబ్బంది ప్రైవేట్ రంగానికి వలస వెళ్ళే పరిస్థితిని కూడా సృష్టిస్తోంది.

ఈ నేపథ్యంలో సమయానికి వేతన సవరణ అమలు అత్యవసరం. ఇది కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు, ఉద్యోగుల కొనుగోలు శక్తిని కాపాడే, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచే కీలక చర్య. సమయానుకూలంగా వేతనాలు సవరించబడితే ఉద్యోగుల్లో ఉత్సాహం పెరిగి, ఉత్పాదకత మెరుగవుతుంది. అలాగే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వినియోగం పెరిగి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. భవిష్యత్తులో వేతన సవరణలతో పాటు ఆరోగ్య బీమా, పెన్షన్, రిస్క్ అలవెన్సులు, విద్య మరియు గృహ సహాయం వంటి సంక్షేమ చర్యలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మొత్తంగా, తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని నిలబెట్టేది ఉద్యోగులే అన్న నిజాన్ని మరువకూడదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల మధ్య వారి ఆర్థిక భద్రతను కాపాడాలంటే సమయానికి వేతన సవరణ అనివార్యం. అది ఉద్యోగి సంక్షేమానికి మాత్రమే కాకుండా, రాష్ట్ర స్థిరత్వం మరియు సుస్థిర అభివృద్ధికి కూడా పునాది అవుతుంది.

**- గువ్వల పవన్‌కుమార్**
అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్


# నారీ శక్తి ముసుగులో డీలిమిటేషన్

భారత రాజకీయ వేదికపై ఒక కీలక మలుపు తిరిగిన క్షణం ఇది. మహిళా సాధికారత అనే లక్ష్యాన్ని ముందుంచుకుని వచ్చిన ఒక చట్టం కానీ దాని వెనుక దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు, ప్రాంతీయ సమతుల్యంపై పడే ప్రభావం దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. 'నారీ శక్తి' అనే ఆకర్షణీయ నినాదం కింద డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాన్ని కలిపి ప్రవేశపెట్టినప్పుడు, అది కేవలం ఒక శాసన ప్రక్రియగా మిగలలేదు. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కులు, రాజకీయ నైతికత అన్నీ ఒకే వేదికపై పరీక్షించబడిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో లోక్‌సభలో జరిగిన ఓటింగ్ కేవలం సంఖ్యల పోటీ కాదు. అది కేంద్ర-రాష్ట్ర సంబంధాల భవిష్యత్తును నిర్ణయించే ఘట్టంగా మారింది. ఒక వైపు మహిళా రిజర్వేషన్‌కు మద్దతు అనే నైతిక బాధ్యత, మరో వైపు రాష్ట్రాల న్యాయమైన వాటాను కాపాడాల్సిన అవసరం, ఈ రెండింటి మధ్య జరిగిన ఈ పోరు భారత రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది.

ఇదే సంఘటన 'నారీ శక్తి ముసుగులో రాజకీయ ప్రయోజనాలా? లేక సమాఖ్య ధర్మానికి రక్షణగా నిలిచిన ప్రజాస్వామ్యమా?' అనే ప్రశ్నను దేశం ముందుంచింది.

లోక్‌సభలో ఏప్రిల్ 17, 2026న జరిగిన ఓటింగ్‌లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం ఒక సాధారణ వైఫల్యం కాదు. అది బీజేపీ వ్యూహాత్మక రాజకీయాలకు స్పష్టమైన చెంపపెట్టు. మహిళా రిజర్వేషన్‌ను 'నారీ శక్తి' పేరుతో రాజకీయ ఆయుధంగా మలచి, దానిని డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో కలిపి ఒకే ప్యాకేజీగా తీసుకురావడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య హక్కులను కుదించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. 298 ఓట్ల మద్దతు, 230 వ్యతిరేక ఓట్లతో రెండింతల మెజారిటీ (352) సాధించలేకపోవడంతో బిల్లు వీగిపోయింది. దీంతో అనుబంధ డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఓటు లెక్క కాదు.



భారత రాజకీయ వ్యవస్థలో సమాఖ్య స్ఫూర్తి ఇంకా బలంగా ఉందని నిరూపించిన చారిత్రక క్షణం.

2023లో నారీ శక్తి వందన అధినియమం (106వ సవరణ) ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయం. కానీ అమలు? 2026 తర్వాత మొదటి జనాభా లెక్కలు (సెన్సస్) అనంతరం డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు వాయిదా. ఇప్పుడు 2026లో ప్రభుత్వం హడావిడిగా స్పెషల్ సెషన్ పిలిచి మూడు బిల్లులు తెచ్చింది. 131వ సవరణ ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేసి 2029 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలు చేయాలని, లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని, యూటీల్లో కూడా అమలు చేయాలని. ఉద్దేశ్యం ఒకటే. మహిళా సాధికారతను 'ముసుగు'గా ఉపయోగించి డీలిమిటేషన్‌ను త్వరగా ముగించడం. ఇది ఉత్తరాది రాష్ట్రాలకు (జనాభాఎక్కువగా ఉన్నవి) మరిన్నిసీట్లు ఇచ్చి,దక్షిణాది రాష్ట్రాలు (జనాభా నియంత్రణలోసాధించిన విజయం కారణంగా) సీట్లు తగ్గించే వ్యూహం. దీనిని ప్రతిపక్షాలు (ఇండియా కూటమి) స్పష్టంగా చెప్పాయి. మహిళలకు రిజర్వేషన్ మద్దతు ఉంది, కానీ డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే ప్రయత్నం సహించేది కాదు.

ఇక్కడే బీజేపీ వ్యూహం బయటపడింది. 2023లో బిల్లును వాయిదా వేసినప్పుడు ప్రభుత్వం సెన్సస్, డీలిమిటేషన్ తర్వాతే అని చెప్పింది. ఇప్పుడు హడావుడిగా 2011 డేటాను ఉపయోగించి త్వరగా అమలు చేయాలనడం ఎందుకు? ఎందుకంటే 2026 సెన్సస్ పూర్తి కావాల్సి ఉంది, దాని ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ రాష్ట్రాల సమాఖ్య హక్కులు కాపాడబడతాయి. బీజేపీకి అది అనుకూలం కాదు. మహిళల సాధికారత నిజమైనదైతే డీలిమిటేషన్‌ను వేరుగా చర్చించి, సమాఖ్య సంప్రదింపులతో ముందుకెళ్లాలి. కానీ ప్రభుత్వం ఒకే ప్యాకేజీలో కట్టి, మహిళల వ్యతిరేకులు అని లేబుల్ వేసి వ్యతిరేకతను అణచివేయాలని చూసింది. ఇది బీజేపీ రాజకీయ శైలి. జనాభా, మతం, ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టి అధికారాన్ని కాపాడుకోవడం.

ప్రతిపక్షాలఐక్యత ఈ ఆటను ఆపేసింది. కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట. మహిళా రిజర్వేషన్ కావాలి. కానీ దక్షిణాదిని బలిచేసే డీలిమిటేషన్ కాదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బతింటుంది. బీజేపీ ఇప్పుడు ప్రతిపక్షాలు మహిళల వ్యతిరేకులు అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి? ప్రభుత్వం సొంత వ్యూహం వల్లే బిల్లు వీగిపోయింది. మహిళా సాధికారతను నిజంగా కావాలంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్‌ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి.

ఈ ఓటమి బీజేపీకి మాత్రమే కాదు.. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షిణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత నిజమైన మార్గంలో ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఇకపై ముసుగులు వేయకుండా, నిజాయితీతో చర్చించాలి. లేకపోతే ఇలాంటి చెంపపెట్టులు మరిన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. భారత దేశం ఒక దేశం కాదు - ఒక సమాఖ్య. దానిని గుర్తించకపోతే ఏ వ్యూహమూ ఫలించదు.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
9010128884

# పుస్తకాల పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1995 నుండి నిర్వహించబడుతున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించడం, కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మిగ్యుఎల్ డి సెర్వంటెస్ పుట్టి మరణించిన తేది ఏప్రిల్ 23, విలియంషేక్స్పియర్,గార్సియాసాడిలా వేగా వంటి రచయితలు మరణించిన తేది, అనేక ఇతర రచయితల పుట్టిన, మరణించిన తేది ఏప్రిల్ 23వ తేది అవడంవల్ల 1995, ఏప్రిల్ 23న యునెస్కో తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించింది.

'చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి.

కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.

మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి ఆయుప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగుతున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి'



ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్యానికి సంబందిచి అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారతదేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథాసాహిత్యం గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తదితర విశ్వవిద్యాలయాలలో భద్రపరచబడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపు రూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధమయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచమంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది.

అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయా లను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాసక్తిని పెంపొం దించే కృషి జరగాలి.

అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణపట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**ఏప్రిల్ 23.. ప్రపంచ పుస్తక దినోత్సవం**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## బండారు శ్యామ్ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన తుమ్మలపల్లి రమేష్



కిర్లంపూడి ఏప్రిల్ 22( మనం న్యూస్ ): కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో బండారు శ్యామ్ తొలి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్యామ్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోట నరసింహం, బండారు రాజీవ్, ఎంపీటీసీ బండారు ప్రసాద్, అనుకుల శ్రీకాంత్, బండారు సుభాష్, బండారు చక్రధర్, బండారు దత్తాత్రేయ వరప్రసాద్, మాదారపు వీరబాబు, రేలా ప్రసాద్, సూరంకాపు సత్యం, కాపు పాలమూరు భద్ర, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని సాంకేతికత ద్వారా మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో యోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ప్రభుత్వం తరపున డ్వాక్రా మహిళలకు సెల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి పాల్గొని డ్వాక్రా మహిళలకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందని అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబ న సాధించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, మొగల్తూరు సొసైటీ అధ్యక్షుడు నిప్పులేటి తారక రామారావు, నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, అందే రామకృష్ణ, నాగిడి రాంబాబు, నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం, ఏప్రిల్ 22 (మనం న్యూస్): సమాజానికి సేవలందించాలనే సదుద్దేశంతో దాతలు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం స్థానిక రాయపేటలోని శ్రీ గౌతమి కళాశాల ప్రాంగణంలో శ్రీ గౌతమి విద్యా సంస్థ ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ విధమైన వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. మేడ్ యునైటెడ్ హాస్పిటల్స్ కు చెందిన కార్డియాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో శ్రీ గౌతమి విద్యాసంస్థల ప్రతినిధులు, నియోజవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ పిర్యాదుపై అధికారులు బృందం విచారణ



కాట్రేనికోన, ఏప్రిల్ 22 మనం న్యూస్: కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగురువు గ్రామం లో పెరుగు భూమి లో ఉన్న చెరువు పై గ్రీవెన్స్ లో అందిన పిర్యాదు పై కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రవికిరణ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.పెరుగు భూమి యొక్క పూర్వ పరాలను గురించి గ్రామస్తులను అడిగి తెలుసు కున్నారు.మా తాత ల కాలం నుండి ఈ భూమి మా గ్రామం అదీనం లోనే ఉందని దాన్ని చెరువు గా చేసి లీజు కు ఇచ్చి తద్వారా వచ్చిన సొమ్ము తో మా గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మ వారి జాతర నిర్వహించడం ఆనవాయితీ గా వస్తుందని, అయితే బలుసు తిప్పకు చెందిన శేషాద్రి అనే వ్యక్తి చెరువు తమకు లీజుకు ఇవ్వలేదన్న నెపంతో తమ గ్రామస్తులపై తప్పుడు కేసులు పెట్టి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వారు అధికారులకు తెలిపారు. కావున తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ విషయంపై కలెక్టర్ గారికి నివేదిక అందజేస్తామని తాసిల్దార్ రవి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డి ఓ చలపతి, హెడ్ వరక్స్ జె ఈ ఈశ్వర మన్యం, పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఆర్వో మంగాదేవి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జగ్గంపేటలో శాంతి ర్యాలీ



జగ్గంపేట ఏప్రిల్ 22 (మనం న్యూస్): మార్క్సిస్టు మహోపాధ్యాయుడు వి ఐ లెనిన్ 156వ జయంతి మరియు సిపిఐ ఎం.ఎల్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్ టు యు, పిఓడబ్ల్యూ స్త్రీ విముక్తి, పి డి ఎస్ యు (విజృంభణ) ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంగా జగ్గంపేటలో స్థానిక ట్రావెల్స్ బంగ్లా నుండి పోలీస్ స్టేషన్, బస్టాండ్ మీదుగా పంచాయతీ కార్యాలయం నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాద అధర్మ యుద్ధాలు నశించాలి, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలు నశించాలి, నూతన ప్రజా స్వామిక విప్లవం వర్ధిల్లాలి అంటూ వి ఐ లెనిన్కు జోహార్లు అర్పిస్తూ ప్లకార్డులతో లెనిన్ చిత్రపటాన్ని ప్రదర్శించారు, అనంతరం ఎంపీడీవో ఆఫీస్ వద్ద పిడిఎస్యు (విజృంభణ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ నేతృత్వంలో ఆటో స్టాండ్ లో ఏర్పాటుచేసిన సిపిఐ (ఎం.ఎల్) జెండాను ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ నాయకులు డాన్ శీను, సోమరాజు, శ్రీను,లోవరాజు, రాంబాబు, రమణ, వేరు గనకమ్మ, సోమాయిలీ, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు మంజూరు చేసిన స్థలంలో నిరసన



పిఠాపురం ఏప్రిల్ 22 మనం న్యూస్ : మాజీ ముఖ్యమంత్రివర్యులు రాష్ట్ర వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పిఠాపురం పట్టణ పరిధిలో పేద ప్రజలకు ఇచ్చిన పట్టా భూములకు ఇప్పటికీ ఇళ్ల మంజూరు చేయకపోవడమే కాకుండా పేద ప్రజలకు ఇచ్చిన భూమిని తెలంగాణకు చెందిన ప్రైవేటు స్కూలుకు 20 ఎకరాల భూమిని కేటాయించి స్థలం వారికి అప్పజెప్పడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఖండిస్తూ బాధిత పట్టాదారులతో కలిసి పట్టాలు ఇచ్చిన స్థలములో నిరసన వ్యక్తం చేసారు. పట్టాదారులకు ప్రభుత్వం వెంటనే ఇల్లు మంజూరు చేయాలని పేద ప్రజలకు ఇచ్చిన పట్టా భూములను పేద ప్రజలకే అందజేయాలని , పట్టాదారులకు మద్దతుగా వైఎస్ఆర్సిపి పార్టీ ఉంటుందని తెలియజేసిన పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ రాష్ట్ర వైఎస్ఆర్సిపి పిఏసి సభ్యురాలు వంగా గీతా విశ్వనాధ్.

## ప్రజలతో మమేకమైన మురళిరాజు పర్యటనకు విశేష స్పందన



ప్రత్తిపాడు, ఏప్రిల్, 22:-(మనం న్యూస్ ): ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైయస్సార్ సిపి నాయకుడు, నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు బుధవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాడు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరుగుతున్న కుటుంబ శుభకార్యాలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ఆనందంలో భాగస్వామిగా నిలిచాడు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో మాగాపు పూరీజగన్నాధం కుమారుడు వెంకట సత్యనారాయణ (నాని) పెళ్లికొడుకు కార్యక్రమంలో పాల్గొని వరుడికి ఆశీర్వాదాలు అందించాడు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశాడు. అదేవిధంగా అదే గ్రామంలో దిబ్బిడి శ్రీనుబాబు కుమార్తె గంగా భవాని మోదమాంబ పెళ్లి కుమార్తె కార్యక్రమంలో పాల్గొని వధువుకు ఆశీర్వాదాలు అందజేశాడు. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపాడు. ఈ కార్యక్రమాల్లో బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, మాగపు ప్రసాద్ రావు, మాగపు శివ, అడపా ప్రకాష్ తదితరులు, అలాగే మాగపు, దిబ్బిడి కుటుంబ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



కాట్రేనికోన, ఏప్రిల్ 22 మనం న్యూస్ : పల్లంకుర్రు లో పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధానంగా భావిస్తూ కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి ) ప్రకారం ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా, తమ పంటను నేరుగా ప్రభుత్వానికి విక్రయించుకునే విధంగా ఈ పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇకపై రైతులు తమ ధాన్యాన్ని సరైన ధరకు, పారదర్శకంగా అమ్ముకునే అవకాశాన్ని ఈ కేంద్రం కల్పిస్తుందని, రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు ఎటువంటి సందేహాలు లేకుండా, స్వేచ్ఛగా తమ పంటను ఈ కేంద్రాల ద్వారా విక్రయించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్ ,కంచు స్తంభం కృష్ణ, పి ఎస్ ఎన్ రాజు,కముజు రాంబాబు,బళ్ళ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చెయ్యేరు, కందికుప్పలలో పోషణ పక్వాడ కార్యక్రమం



కాట్రేనికోన, ఏప్రిల్ 22 మనం న్యూస్: చెయ్యేరు సెక్టార్లో కొమ్మాయి చెరువు మరియు కందికుప్ప సెక్టార్లో పెద చెరువు పేట అంగన్వాడీ సెంటర్ల వద్ద 'పోషణ పక్వాడ' కార్యక్రమం సిడిపిఓ ముదునూరి నిహారిక ఆధ్వర్యంలో బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు కే వి వి ఎస్ తులసి కుమారి మరియు కుమారి ఎల్ వి రమణి మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే పోషకాహారం గురించి మరియు తల్లిపాలు ప్రాముఖ్యత గురించి విపులంగా తెలియ చేసారు.ఆహారంలో ఉప్పు,షుగర్ తగ్గించాలని,పిల్లలు మరియు తల్లులు సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలని తెలిపారు.అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు,హెల్త్ సిబ్బంది,తల్లులు,కిశోరి బాలికలు హాజరయ్యారు.

## తూర్పు లక్ష్మీపురంలో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన



ఏలేశ్వరం,ఏప్రిల్ 22(మనం న్యూస్ ): మండలంలో తూర్పులక్ష్మీపురం గ్రామంలో,రాష్ట్రీయ గోకుల్ మిషన్,రాష్ట్ర పాడి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి హాజరయ్యారు.పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు దీనిలో భాగంగా ఒక సంవత్సరం లోపు వయస్సు ఉన్న 40 పెయ్యి దూడల ప్రదర్శన చేపట్టారు.ప్రదర్శనలో పాల్గొన్న 40 పెయ్యి దూడలకు ఏలిక పాముల నివారణకు మందును దూడలకు అందించారు. అనంతరం లేగ దూడల పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానంలో వీరంరెడ్డి దొరబాబు, ద్వితీయ స్థానంలో పేరుపురెడ్డి సూరిబాబు,తృతీయ శ్రేణిలో మజ్జి శ్రీనుబాబు, గల లేగ పెయ్యి దూడల గెలుపొందగా ఆయారైతులకు నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ప్రదర్శనకు వచ్చిన లేగ దూడలకు లీవర్ టానిక్స్, మినరల్ బ్లాక్స్ అందించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఇజ్జనగిరి ప్రసాద్, వీరంరెడ్డి దొరబాబు, నైనాలశెట్టి బృహత్,పెంటకోట మోహన్,గంగిశెట్టి ప్రసాద్,పశు సంవర్ధక శాఖ జేడీ కాంతారావు,చిక్కం బాలచంద్ర యోగేశ్వర్,పశు వైద్యాధికారులు ఈ సతీష్ కుమార్, సాయి కృష్ణ ,టీవీ కళ్యాణి,పంచాయతీ కార్యదర్శి ఆర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## 1 కోటి 20 వేల విలువ గల 501 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగింత



- 501 మొబైల్ ఫోన్లను సిఇఐఆర్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేసిన ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు ఏఫ్రిల్ 22 మనం న్యూస్: చిత్తూరు జిల్లా లో ఇప్పటివరకు పదనాలుగు దశలలో సుమారు 9 కోట్ల 55 లక్షల 40 వేల రూపాయలు విలువ గల 4607 ఫోన్ల రికవరీ చేసినట్లు చిత్తూరు జిల్లా ఎస్పితెలిపారు.బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పోలీసులు తమ నిత్యజీవితంలో ఒకటైన మొబైల్ ఫోన్ ను తమకు అందించిన జిల్లా ఎస్పీ కి, చిత్తూరు జిల్లా పోలీసులకు మొబైల్ బాధితులు వారి ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మొదటి దశలో 500 ఫోన్ లు, రెండో దశలో 200 ఫోన్లు, మూడవ దశలో 300 ఫోన్లు, నాలుగవ దశలో 200 ఫోన్లు, ఐదవ దశలో 300, ఆరవ దశలో 200 ఫోన్లు, ఏడవ దశలో 330 ఫోన్లు, ఎనిమిదవ దశలో 305 ఫోన్లు, తొమ్మిదవ దశలో 300, పదవ దశలో 450 ఫోన్లు, 11 వ దశలో 456, పన్నెండవ దశలో 250 ఫోన్లు, 13 వ దశలో 315 ఫోన్లు మరియు 14 వ దశలో 501 ఫోన్ల రికవరీ. 1 4 వ దశలో 501 ఫోన్లను రికవరీ చేసాం. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి మొబైల్ రికవరి చేసి భాధితులకు అందజేశాం. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ మరియు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్ల రికవరీ చేయడమైనది. బాధితుల మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసిన బాధితులు. ఇతర రాష్ట్రాలు మరియు జిల్లాల నుండి కూడా ఫిర్యాదు చేస్తున్న బాధితులు. ఇతర రాష్ట్రాల నుండి చిత్తూరుకు రాని వారికి ప్రత్యేకంగా కొరియర్ ద్వారా బాదితుల ఫోన్ లను నేరుగా వారి ఇంటికి చేర్చుతున్నాం. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న మొబైల్ వినియోగ దారులకు ఫిర్యాదు చేయడానికి 'సిఇఐఆర్ సేవలతో మరింత సులువుగా ఉంటుంది. 501 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసిన చిత్తూరు పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని అభిన ఒదించిన- జిల్లా ఎస్పీ చిత్తూరు పోలీస్ గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని ఈరోజు ఏర్పాటుచేసి 14వ దశలో రికవరీ చేసిన సుమారు 1 కోటి 20 వేల రూపాయలు విలువ గల 501 మొబైల్ ఫోన్ లను బాధితులకు అందజేసిన ఎస్పీ తుషార్ డూడి,

## ప్రభుత్వ స్కూల్లో చదివించి ఆదా అయిన డబ్బుతో ఇంజనీరింగ్ ఫీజులు చెల్లించుకోవచ్చు



సఖినేటిపల్లి, ఏప్రిల్ 22,మనం న్యూస్: పిల్లలని కార్పొరేట్ పాఠశాల్లో కాకుండా ప్రభుత్వ స్కూల్ లో చదివిస్తే రూ. 5లక్షల నుంచి రూ. 10 లక్షలు వరకు ఆదా చేసుకోవచ్చు అని అలా ఆదా అయిన డబ్బుతో ఇంజనీరింగ్ ఫీజులు చెల్లించుకోవచ్చు అని ఎం ఈ ఓ -2 ఎం వెంకటేశ్వరావు అన్నారు.మండలం లోని మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ మహాలక్ష్మమ్మ టెంపుల్ మోరి నందు పాఠశాల వార్షికోత్సవం అత్యంత వైభవంగా గ్రామస్తులు మరియు తల్లిదండ్రులు సమక్షంలో మంగళవారం సాయంత్రం నుండి రాత్రి వరకు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు గ్రామ వార్డు మెంబర్లు మరియు ప్రముఖులు విచ్చేశారు. ముఖ్య అతిథి గా విచ్చేసి న మండల విద్యాశాఖ అధికారి -2 మద్దాలి వెంకటేశ్వరరావు మాట్లాడారు.ఈ పాఠ శాల ప్రగతి లో మొదటి స్థానం ఉండటం పట్ల ఈసందర్భంగా ఉపాధ్యాయులనుఅభి నందిస్తున్నట్లు తెలిపారు. తాను కూడా ఈ పాఠశాల్లో నే చదువుకుని ఎం ఈ ఓ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన పాఠశాలప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్ ఆర్ నాగార్జున రావు ఉపాధ్యాయులు వి . మురళీకృష్ణ, టీ . సుబ్బలక్ష్మి పి .రత్న వాణి మరియు ఉండపల్లి గిరిబాబు పాల్గొన్నారు.

### అంబరాన్నంటిన మోరి పాఠశాల

# వార్షికోత్సవ వేడుకలు

### ఆద్యంతం అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

సఖినేటిపల్లి , ఏప్రిల్ 22,మనం న్యూస్: సఖినేటిపల్లి మండలం మోరి మహాలక్ష్మమ్మ టెంపుల్ మోడల్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం అత్యంత ఘనంగా జరిగాయి. చిన్నారుల సంస్కృతి కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఐదవ తరగతి విద్యార్థిని ఉండపల్లి శర్మద చేసిన భక్త ప్రహ్లాద ఏకపాత్ర భినయం అందర్నీ అలరించింది. శర్మద భక్త ప్రహ్లాదుడి వేషధారణలో ఏకధాటిగా 15 నిమిషాల పాటు భక్త ప్రహ్లాదుడి శ్లోకాలు ఎక్కడ ఆగకుండా వల్లించడం అందరిని ఆకట్టుకుంది. అదేవిధంగాపాఠశాల మూడో తరగతి విద్యార్థి మోహన్ చేసిన శ్రీనాథ కవి సార్వభౌముడు, నాలుగవ తరగతి విద్యార్థిని హవీలా శ్రేష్ట ఇచ్చిన ఇంగ్లీష్ స్పీచ్ మరియు డాన్స్ పెర్ఫార్మెన్స్, యోహిత్ చేసిన సుభాష్ చంద్రబోస్ వేషధారణ మరియు మానస చేసిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి వేషధారణ అందరిని ఆకట్టుకున్నాయి. సంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రదర్శనలు చేసిన విద్యార్థులు అందరికీ ఎం ఈ ఓ -2 ఎం వెంకటేశ్వరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీధర్ కృష్ణ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎస్ ఆర్ నాగార్జున రావు, ఉపాధ్యాయులు వి . మురళీకృష్ణ , టీ . సుబ్బలక్ష్మి , పి .రత్న వాణి, మరియు ఉండపల్లి గిరిబాబు, గ్రామ పెద్దలు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



## జనగణనపై అవగాహన కార్యక్రమం



ఏలేశ్వరం,ఏప్రిల్ 22(మనం న్యూస్ ): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనాభా గణనను డిపార్ట్మెంట్ ఒఫ్ పోలిటికల్ సైన్స్,ఎన్ఎస్ఎస్ ఆద్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డా.డి సునీత అద్యక్షతన అవగాహన కార్యక్రమ్యాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ జనగన ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి జరుగుతుందని దీని వల్ల దేశ జనాభా,పురుషులు,మహిళలు,చిన్న పిల్లలు ఇలా చాలా విషయాలు డేటా ఏర్పాటుచేయడం జరుగుతుందని కాబట్టి అందరూ స్వీయ జనగణనలో పాల్గొని జనగణన నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అని అధికారిక పోర్టల్ ద్వారా 2027 జనగణన కోసం ఏప్రిల్ 16, 2026 నుండి ఈ సదుపాయం ప్రారంభమైందని మొబైల్ నంబర్, ఆధార్ కార్డుతో లాగిన్ అయి కుటుంబ,వ్యక్తిగత వివరాలను నమోదు చేసి, రిఫరెన్స్ నంబర్ను సేవ్ చేసుకోవాలని, పేరు, వయస్సు, విద్య,ఉద్యోగం,వివాహ స్థితి,భాష, మతం,ఇంటి అడ్రస్,సభ్యుల సంఖ్య, హౌసింగ్ వివరాలు నమోదు చేసి సబ్మిషన్ చేయాలని తరువాత వచ్చే రిఫరెన్స్ ఐడిని భద్రపరుచుకోవాలని తెలియజేశారు.

# అనుమతులు పొందిన జలధార - జలహారతి పనులు వెంటనే ప్రారంభించాలి



- **అరికెర రెసిడెన్షియల్ స్కూల్ సంఘటన పై కలెక్టర్ సీరియస్**

**కర్నూలు, ఏప్రిల్ 22:మనం న్యూస్:** జలధార - జలహారతి కార్యక్రమం కింద అనుమతులు పొందిన అన్ని పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, ఏపీఓలతో ప్రత్యక్షంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., జలధార - జలహారతి కార్యక్రమం పరిధిలో ఇప్పటికే అనుమతులు పొందిన పనులు అయిన కొత్త ఫారం పాండ్లు ఫీడర్ ఛానెల్ డి-సిల్టింగ్, చెరువుల పూడిక తీత, పెర్కొలేషన్ ట్యాంకుల పూడిక తీత వంటి పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇంకా అనుమతులు పొందని పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్ పోర్టల్లో పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించి, పని పేరు, లొకేషన్, పనుల స్థానం, అంచనా వ్యయం, ఎన్ఆర్జీఎస్ కింద ఖర్చు, జలధార కింద ఖర్చు వంటి అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, ఈరోజే రాత్రి లోపు జిల్లా కలెక్టర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ ఇరిగేషన్ బాలచంద్ర రెడ్డి, జెడ్పీ సీఈఓ రమణా రెడ్డి, డి.డబ్ల్యూ.ఎం.ఏ పీడీ నరసింహ రెడ్డి, జిల్లా ఎంపిడీఓలు, ఏఈలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు

- **క్షేత్రస్థాయిలో దేవాలయ తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

**తిరుపతి ఏఫ్రిల్ 22 మనం న్యూస్ :** తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తుల సురక్షిత ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునే విధంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ గారు వెల్లడించారు. ఈ ఏర్పాట్లపై బుధవారం తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, అధ్యక్షతన ఎస్పీ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శారదా దేవి, అదనపు ఎస్పీ రవి మనోహర్ ఆచారి , శాంతిభద్రతల డీఎస్పీలు,



ఎస్బీఐ డీఎస్పీ గీతా కుమారి, తిరుపతి డీఎస్పీ, ట్రాఫిక్ డీఎస్పీ, ఆర్డీఓ రామమోహన్, ఈఓ జయకుమార్ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ భక్తుల భద్రతను అత్యున్నత ప్రాధాన్యతగా పరిగణిస్తూ క్యూ లైన్ నిర్వహణ, దర్శన వ్యవస్థ, భక్తుల రద్దీ నియంత్రణపై విస్తృతంగా సమీక్షించారు. ఉత్సవాల సందర్భంగా సీసీ కెమెరాలను సమగ్రంగా ఏర్పాటు చేసి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.

# శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.25 కోట్లు

- **శ్రీమఠ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు**

**మంత్రాలయం, ఏప్రిల్ 22,(మనం న్యూస్ ) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ. 3,25,96,854లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. బంగారం 47 గ్రాములు, వెండి 592 గ్రాములను భక్తులు కానుకులుగా హుండీ లో సమర్పించుకున్నారని మేనేజర్ తెలిపారు.



# వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం... ఆరోగ్యం కాపా డుకుందాం

- **రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణి**
- **కె.శ్రీనువాసులు,అధ్యక్షులు**

**కర్నూల్, ఏప్రిల్ 22(మనంన్యూస్):** కర్నూలు నగరం,సమాచార శాఖ భవన్ ప్రాంగ ణంలో బుధవారం రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపాడుకుందాం అనే నినాదంతో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్ర మానికి సమాచార శాఖ డిడి కె.జయమ్మ,సెట్కూ రు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్,ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం(ఏపీజేఫ్) జిల్లా అధ్యక్షులు,టి.రామ కృష్ణ,మెడిక వర్ హాస్పి టల్ సిబ్బంది జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి,జి.ఎం.డాక్టర్ మ హేశ్వర్ రెడ్డి,ఎజి ఎం ఎస్.ఖాదర్ బాషా హాజర య్యారు.అనంతరం వారి చేతుల మీదుగా జర్న లిస్ట్ లకు టోపీలు



అందచేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం సమాజంలో జరి గే విశేషాలను సే కరించి,వార్తలుగా ప్రచురణ చే స్తూ ప్రజలను చైత న్యం చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర ప్రధమంగా ఉందన్నారు.వార్తల సేకరణలో జర్నలిస్ట్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.ఇలాంటి జర్నలిస్ట్ లను వే సవి తాపం నుండి కాపాడేందుకు తమ తృణసా యంగా రాయల సీ మ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.శ్రీనువాసులు టోపీలు పం పిణి చేయడం అభి నందనీయం అని కొనియా డారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేష న్ నాయకులు భూపాల్,జి ల్లా అధ్యక్షులు,విచ క్షణ దినపత్రిక ఎడిటర్ ర ఘు,రాములు దినపత్రిక ఎడిటర్ చంద్రశేఖర్,జ ర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

**బేతంచేర్ల ఏప్రిల్ 22 (మనం న్యూస్)** మండల పరిధిలోని గోరుమానకొండ తాండా సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీ పై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యాన్న ఉదయ్ కుమార్ మండల కార్యదర్శి ప్రదీప్ లు స్థానిక మండల విద్యాధికారి కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం మండల విద్యాధికారి 2 అబ్రహం గారికి వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఖాదిర్ విష్ణు సుదర్శన్ మురళీకృష్ణ సునీల్ అబ్దుల్లా మురళి మహేష్ చరణ్ మధు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# సిపిఐ ఎంఎల్ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం




**కర్నూలు ఏప్రిల్ 22మనం న్యూస్:** ఈ భారత దేశ విముక్తికి మార్క్సిజం,లెనినిజం, మావో ఆలోచన విధానాల వెలుగులో జరిగే పోరాటాలే సరైన మార్గమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కర్నూలు నగరంలో గోకారి కాలనీ నందు మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ 146వ జయంతి, సిపిఐ(ఎం-ఎల్) 57 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సుత్తి కొడవలి జెండాను నగర కార్యదర్శి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి , పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ మాట్లాడుతూ భారత దేశ విముక్తి కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం,దోపిడీ, పీడన, అణిచివేత, కులమతాలు లేని సమ సమాజ నిర్మాణం కోసం, మార్క్సిజం, లెనినిజం,మావో ఆలోచన విధానమే సరైన మార్గమని అన్నారు. దేశంలో అసమానతలు, అవినీతి ఉన్నంతవరకు వర్గ పోరాటాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యూ నగర అధ్యక్షులు సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి తిరుపాల్, పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ప్రగతిశీల మహిళా సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు మౌలాభి, లక్ష్మీదేవి, ఎల్లమ్మ, ప్రగతిశీల ఆటో మోటార్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, మల్లికార్జున, ఓబులేష్ మొదలైన వారు పాల్గొన్నారు.

# నేడు గంగా పుష్కరోత్సవం

**ఏప్రిల్22,మనంన్యూస్:** మహానంది పుణ్యక్షేత్రం లో నేడు గంగా పుష్కరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటలకు రాజగోపురం వద్ద గంగా దేవి ఉత్సవ మూర్తులకు ఉపచార పూజలు చేసి గంగాదేవిని వేదమంత్రాలతో ,మంగళ వాయిద్యాలతో స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు స్నానం చేసే అవకాశం కల్పిస్తామన్నారు.12 సంవత్సరాలకు ఒక సారి వచ్చే గంగానదిలో పుష్కర స్నానం చేసినంత పుణ్యం కలుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# అర్హులైన దివ్యాంగులకు ఇంటి స్థలాలు, గృహాలు ఇవ్వాలి



- **స్ఫూర్తి దివ్యాంగుల సొసైటీ అధ్యక్షుడు పీట్ల మద్దిలేటి**

**బేతంచేర్ల ఏప్రిల్ 22 (మనం న్యూస్)** పట్టణ మండలంలో ఉన్న దివ్యాంగులకు కూటం ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని స్ఫూర్తి దివ్యాంగుల సేవాసమితి అధ్యక్షుడు పీట్ల మద్దిలేటి కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు దివ్యాంగుల కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణ మండలంలో దివ్యాంగుల కు గూడు లేక ఇబ్బంది పడుతున్నారని ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మాకు గృహాలు నిర్మించడం లేదు కూటమి ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం గుర్తించి పి ఎం ఏ వై ద్వారా గృహాలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి గృహాలు నిర్మించవలసిందిగా వారు కోరారు ఈ కార్యక్రమంలో శకుంతల రామాంజనేయులు సురేష్ మద్దమ్మ రామ్మోహన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసు శాఖ పెద్దపీట

- **జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం, ఏప్రిల్ 22 మనం న్యూస్ ప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల భద్రతపై తమ పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. అనంతపురంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో పెరుగుతున్న వివిధ నేరాల నేపథ్యంలో మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కీలక సేవలను ఆయన పరిచయం చేశారు. ముఖ్యంగా శక్తి యాప్, స్త్రీ రక్ష పోర్టల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందే విధానాన్ని వివరించారు. ఈ యాప్లు మహిళలకు రక్షణగా నిలుస్తాయని, ప్రతి మహిళ వీటిని వినియోగించు కోవాలని సూచించారు. అదేవిధంగా... బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, పోక్సో చట్టం గురించి సవివరంగా అవగాహన కల్పించారు. చిన్నారులపై జరిగే నేరాలకు ఈ చట్టం కఠినంగా అమలవుతుందన్నారు.తల్లిదండ్రులు,ఉపాధ్యాయు లు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.



# మట్కా బీటర్లు అరెస్ట్



**మంత్రాలయం , ఏప్రిల్ 22,మనం న్యూస్:** మంత్రాలయం మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో మట్కా రాస్తున్న వ్యక్తులను మాధవరం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు తుంగభద్ర గ్రామంలోని కొత్త సచివాలయం దగ్గర మట్కా రాస్తున్న తుంగభద్ర గ్రామానికి చెందిన బోయ బసవ , ఉప్పరి నాగరాజు ,రాంపురం గ్రామానికి చెందిన రుద్రప్ప స్వామి మట్కా చీటీలు రాస్తుండా రాబడిన సమాచారం తో తన సిబ్బంది తో వెళ్ళి దాడి చేసి పట్టుకున్నమన్నారు. వారి దగ్గర నుండి రూ. 13,860/- నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా మట్కా రాసిన లేదా ఆడినా, క్రికెట్ బెట్టింగ్, లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వీరేష్, కానిస్టేబుల్ వీరాంజనేయుల, భాస్కర్ ఉన్నారు.

# ఘనంగా సర్వేపల్లి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పేరెంట్స్ డే వేడుకలు

- **హాజరైన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



**కర్నూలు ఏప్రిల్ 22మనం న్యూస్** స్థానిక కృష్ణానగర్లోని సర్వేపల్లి విద్యాసంస్థలయందు ప్రీ-ప్రైమరి ప్రైమరి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే. పేరెంట్స్ డే వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల నియోజక వర్గ పార్లమెంటు సభ్యురాలు టి.డి.పి నేషనల్ జనరల్ సెక్రటరీ డా.బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్డే మరియు పేరెంట్స్డే కలిపి నిర్వహించడం నిజంగా అభినందనీయం అని ఆమె అన్నారు. మరియు విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలు, నీతినియమాలు, క్రమశిక్షణ, దేశభక్తి పాఠశాలస్థాయి నుండే అలవర్చుకోవాలని ఆమె తెలిపారు. సర్వేపల్లి పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ స్కూల్ డైరెక్టర్ పి. దీక్షిత్ తమ పాఠశాలలో ఇప్పుడు అవలంబిస్తున్నటువంటి ఐఐటి, నీట్ విద్యా విధానంతో పాటు కేమ్ బ్రిడ్జ్ కరికులమ్, 21 ట్ట సెంచరి స్కిల్స్, కోడ్ స్కూల్ ఫిన్లాండ్ ఎడ్యుకేషన్ ఇంకా కొత్త విద్యావిధానాలన్నింటిని రాబోయే విద్యాసంవత్సర నుండి అమలు చేస్తామని, సివిల్ సర్వీసెస్ గురించి అవగాహనా కార్యమాలు మరియు కోచింగ్ కూడా తనే స్వయంగా ఇవ్వబోతున్నామని యం.పి డా. బైరెడ్డి శబరి కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇంత విజయవంతంగా ఈ కార్యక్రమం జరగడానికి తోడ్పడిన యం.పి. శ్రీమతి డా. బైరెడ్డి శబరి గారిని, విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ఎంతగానో అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు జైలు శిక్ష, లక్ష జరిమానా

- **తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి**

**తిరుపతి, ఏప్రిల్ 22 మనం న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (ఆర్ఎస్ఎఎస్ టిఎఫ్) కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ శ్రీ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 36/2020 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ అటవీ పరిధిలోని చామల రేంజ్లో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు, విల్లుపురం జిల్లా సాతానూరు గ్రామానికి చెందిన వెల్లి ఇలై రాజా, విల్లుపురం జిల్లా ఎరక్కమ్ పట్టు గ్రామానికి చెందిన పలని స్వామి కాగా వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6 లక్షలు జరిమానా విధించారు తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ కులశేఖర్ తెలిపారు.

ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న టాస్క్ ఫోర్స్ దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.



# ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతలో వైఫల్యం ఉండరాదు

**అనకాపల్లి ఏప్రిల్ 22 మనం న్యూస్** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 23, (గురువారం) అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, గజిరెడ్డిపాలెంలో జరగనున్న 'రెన్యూ ఫొటోవోల్టాయిక్స్' ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారు. ఈ పర్యటనను పురస్కరించుకుని, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. కేటాయించిన విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలి. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలి. విధి నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలని దిశానిర్దేశం చేశారు.



# రోడ్డు దాటాలంటే సాహసం తప్పదు!




- **దారకొండ ఘాట్ రోడ్ దుస్థితిపై ప్రయాణికుల ఆగ్రహం**

**గూడెంకొత్తవీధి ఏప్రిల్ 22 మనం న్యూస్ :** మండలంలోని కీలక అంతర్రాష్ట్ర రహదారిగా మూడు రాష్ట్రాలను కలిపే ఏకైక రహదారిగా పేరుగాంచిన దారకొండ ఘాట్ రోడ్ ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు రాష్ట్రాలను కలుపుతూ నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే వణుకు పుడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంజూరైన నిధులతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ, పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. రోడ్డుపై కంకర రాళ్లు వేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కార్లు, ద్విచక్ర వాహనాలు కంకర రాళ్లలో ఇరుక్కుపోయి బయటకు రావడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. కొన్నిచోట్ల ప్రమాదాలకు తృటిలో తప్పించుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గం ద్వారా అత్యవసర సేవలు, రోగుల రవాణా, సరుకు రవాణా జరుగుతుండగా, ఇలాంటి దుస్థితి కొనసాగితే ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






# పరిపక్వత లేకపోతే అభిషేక్ నంబర్ వన్ ఎలా అవుతాడు?: వరుణ్ ఆరోన్

ఢిల్లీ క్యాపిటల్స్ పై చివరి వరకూ క్రీజ్ లో ఉన్న అభిషేక్ శర్మ అజేయశతకంతో అదరగొట్టాడు. సన్ రైజర్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు దూకుడుగా ఆడే క్రమంలో అనవసరమైన షాట్లు కొట్టి పెవిలియన్ కు చేరేవాడు. దీంతో అతడి పరిపక్వతపై సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వచ్చాయి. అయితే, ఈ విషయంలో అభిషేక్ ను హైదరాబాద్ బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్ వెనుకేసుకొచ్చాడు. అతడు ఫామ్ ను కోల్పోయిన సమయంలోనూ అతడి పరిణతిలోపాన్ని ప్రశ్నించలేమని వరుణ్ వ్యాఖ్యానించాడు.



''అభిషేక్ శర్మ ఎప్పుడూ పరిణతితోనే ఉంటాడు. గత కొన్నేళ్లుగా అతడి ఆటతీరు ఇలానే ఉంది. ఆ పరిపక్వత లేకపోతే ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 ప్లేయర్ గా ఎదగగలడా? ప్రత్యర్థినిబట్టి, పిచ్ నుబట్టి ఎలా ఆడాలో నిర్ణయించుకుంటాడు. అందుకు ఈ మ్యాచ్ నే చూడాలి. ఈ పిచ్ తొలుత బ్యాటింగ్ కు కాస్త కష్టంగా మారింది. ప్రతి బంతిని ఆచితూచి ఆడాడు. ఇక్కడ ప్రత్యర్థిని గౌరవించాడు. గతంలోనూ ఇలానే వ్యవహరించాడు. అయితే, హైరిస్క్ గేమ్ లో ఒక్కోసారి వర్కౌట్ కాకపోవచ్చు. అందుకే, వెసులుబాటు ఇస్తుండాలి. ప్రతి మ్యాచ్ లోనూ వంద శాతం డెడికేషన్ తో ఆడినా ఫలితం ఒక్కోసారి అనుకూలంగా రాకపోవచ్చు'' అని వరుణ్ ఆరోన్ వెల్లడించాడు.

**మా బౌలర్లు టాలెంటెడ్..**

''ఇతర బౌలర్లతో పోలిస్తే మా కుర్రాళ్ల నైపుణ్యం ఏమాత్రం తగ్గదు. మలింగను తీసుకుంటే బంతిని రివర్స్ చేస్తాడు. ఇది ప్రత్యర్థి బ్యాటర్లకు చాలా కష్టం. ఇక సకిబ్ 140+కి.మీ వేగంతో నిలకడగా బౌలింగ్ చేస్తాడు. స్లో బంతులనూ అద్భుతంగా సంధించగల బౌలర్. ఈ సీజన్ లో మా ప్రణాళిక ఒక్కటే. పిచ్ తో సంబంధం లేకుండా అద్భుతమైన బౌలింగ్ రాబట్టాలి. ఇప్పటికే సకిబ్, మలింగ సాధించారు. గత రెండేళ్లుగా సకిబ్ ను చూస్తున్నా. ఉప్పల్ పిచ్ పై బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం చూస్తుంటే ముచ్చటేస్తోంది'' అని ఆరోన్ తెలిపాడు.

## సన్ రైజర్స్ కెప్టెన్సీ నుంచి ఇషాన్ కిషన్ అవుట్?



ఐపీఎల్-2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ కు అదిరిపోయే వార్త అందింది. ఏప్రిల్ 25న జైపూర్ వేదికగా రాజస్తాన్ రాయల్స్ తో జరగనున్న మ్యాచ్ లో ఎస్ఆర్హెచ్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ బరిలోకి దిగనున్నాడు. దీంతో తాత్కాలిక కెప్టెన్ గా వ్యవహరిస్తున్న ఇషాన్ కిషన్ తన బాధ్యతలను కమ్మిన్స్ కు అప్పగించనున్నాడు.కమ్మిన్స్ వెన్ను గాయం కారణంగా ఇప్పటివరకు ఎస్ఆర్హెచ్ ఆడిన ఏడు మ్యాచ్ లకు అందుబాటులో లేడు. అతడు ఇటీవలే క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన ఫిట్ నెస్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఎస్ఆర్హెచ్ క్యాంప్ లో చేరాడు. మంగళవారం ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్తో జరిగిన మ్యాచ్ లోనే కమ్మిన్స్ ఆడుతాడని అంతా భావించారు. కానీ కాస్త అసౌకర్యంగా ఉండడంతో టీమ్ సెలెక్షన్ అందుబాటులేకపోయాడు. అయితే రాజస్తాన్ తో మ్యాచ్ లో మాత్రం కమ్మిన్స్ ఆడడం దాదాపు ఖాయమైంది. అతడు ఇప్పటికే తన ప్రాక్టీస్ ను కూడా మొదలు పెట్టాడు. కాగా కమ్మిన్స్ గైర్హాజరీలో ఇషాన్ జట్టును అద్భుతంగా నడిపించాడు.



# తమ్ముడు హార్దిక్‌తో విభేదాలు.. స్పందించిన కృనాల్ పాండ్య

ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ సమయంలో హార్దిక్ ఔటైన తర్వాత కృనాల్ పాండ్య పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నాడు. అతడిని చూస్తూ హార్దిక్ డగౌట్ కు వెళ్లడం సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చాయని కొత్త చర్చకు తెర లేపింది. అయితే, వాటిపై వస్తోన్న వార్తలను కృనాల్ కొట్టిపడేశాడు. ఈ వీడియోను ఆర్సీబీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

డానిష్ మిస్టర్ నాగ్స్ అడుగుతూ.. ''మీ ఇద్దరి బంధం బాగుంది కదా? లేకపోతే ఏదైనా గొడవా?'' అని ప్రశ్నించారు. అంతా బాగుందని కృనాల్ సమాధానం ఇచ్చాడు. ఇక లఖ్ నవూ యువ ఆటగాడు ముకుల్ చౌదరిని స్లెడ్జ్ చేశాడంటూ వస్తోన్న ఆరోపణల పైనా కృనాల్ స్పందించాడు.

**స్లెడ్జింగ్ పైనా..** ''ఓ కుర్రాడిని నేను స్లెడ్జ్ చేసినట్లు బయట నుంచి చాలామంది విమర్శిస్తున్నారు. నేను అతడికి బౌలింగ్ చేశా. తొలి బంతికే ప్యాడ్స్ తాకిన వెంటనే ఔట్ కోసం అప్పీలు చేశా. ఆ తర్వాత.. 'ముకుల్ నువ్వు కుర్రాడివి. నా బౌలింగ్ లో నువ్వు సిక్స్ లు కొట్టగలవు. అయితే, లాంగాఫ్ లేదా లాంగాన్ మీదుగా స్టాండ్స్ లోకి పంపించు' అని మాత్రమే అన్నా. నేనెక్కడా స్లెడ్జింగ్ చేయలేదు. అతడు కూడా నవ్వేశాడు. అదంతా సరదాగా అన్నదే. నా స్టైల్ ను చూసి.. నేను చాలా సీరియస్ గా ఉంటానని, నాకు కోపమెక్కువని అనుకుంటారు. కానీ, నేను అలా ఉండను'' అని కృనాల్ వెల్లడించాడు.



## ప్రముఖ నిర్మాత మృతి!

తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాత, విశ్లేషకులు త్రిపురనేని చిట్టిబాబు మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఐతే, చిట్టిబాబు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రముఖ రచయిత త్రిపురనేని మహారథి కుమారుడే చిట్టిబాబు. మొదట కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేశారు. ఆ తర్వాత 'సంతానం' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. మొత్తం 12 సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా దాదాపు 30 చిత్రాల్లో తెరపై కూడా కనిపించారు. ఆ తర్వాత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి పలు సినిమాలు నిర్మించారు. ఆయన మరణం పట్ల పలువురు తెలుగు సినీ ప్రముఖులు, ప్రేక్షకులు సంతాపం తెలుపుతూ.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.



## వి.వి.వినాయక్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా 'గేదెలరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్

రఘు కుంచె టైటిల్ పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గేదెలరాజు' సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్, వి.ఎన్.ఆదిత్య, రచయిత కమ్ ప్రొడ్యూసర్ కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన దర్శకుడు చైతన్య మోటూరి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని, మోటూరి టాకీస్ పతాకంపై వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఈ నెల 24న థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ.. సింగర్, మ్యూజిక్ డైరెక్టర్, నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రఘుకుంచె సోలో హీరోగా చేసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. కొత్త వారైనా సరే, కంటెంట్ బాగుంటే సినిమాలు తప్పకుండా సక్సెస్ అవుతాయని కోన వెంకట్ పేర్కొన్నారు. కుమారుడు చైతన్యపై నమ్మకంతో సినిమా నిర్మించిన తల్లిదండ్రులను వి.ఎన్.ఆదిత్య ప్రత్యేకంగా అభినందించారు.

కాకినాడ పట్టణ నేపథ్యంగా రౌడీయిజం చుట్టూ ఈ కథ తిరుగుతుందని రఘు కుంచె వెల్లడించారు. ముఖ్యంగా సినిమాలో చివరి 20 నిమిషాల ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ లాంటి అగ్ర సంస్థ ఈ చిత్రాన్ని సుమారు వందకు పైగా స్క్రీన్లలో పంపిణీ చేస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలను పెంచుతోంది.



## 'కొరియన్ కనకరాజు'పై లేటెస్ట్ అప్ డేట్ !

మెగా హీరో వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో 'కొరియన్ కనకరాజు' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన యంగ్ బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తోంది. వరుణ్ తేజ్ పై ఓ కామెడీ ఎపిసోడ్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ క్లైమాక్స్ లో వచ్చే ఈ ఎపిసోడ్ సినిమా మొత్తానికే స్పెషల్ కామెడీ ఎపిసోడ్ లా ఉంటుందట. మేర్లపాక గాంధీ మార్క్ మేకింగ్ తో ఈ ఎపిసోడ్ లో ఫుల్ ఎంటర్ టైన్ గా ఉంటుందట.

అన్నట్టు, ఈ సినిమాలో వరుణ్ తేజ్ కనకరాజు పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఆ మధ్య విడుదలైన గ్లింప్స్ లో వరుణ్ తేజ్ 'నేను తిరిగొచ్చేశా' అంటూ కొరియన్ భాషలో చెప్పడం ఆకట్టుకుంది. ఇంతకీ, ఈ సినిమాకి కొరియన్ భాషకు ఏమిటి సంబంధం అనేది ? సినిమాలో చాలా ఆసక్తిగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. మరి ఈ సినిమా ఏ రేంజ్ విజయాన్ని సాధిస్తోందో చూడాలి.

# నేను జైలుకు వెళ్లడానికి డబ్బు చెల్లించకపోవడమే కారణం కాదు : రాజ్ పాల్ యాదవ్



బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్ చెక్ బౌన్స్ కేసులో ఇటీవల తిహాడ్ జైలుకెళ్లిన విషయం తెలిసిందే. తాను జైలుకు వెళ్లడానికి డబ్బు చెల్లించకపోవడం మాత్రమే కారణం కాదని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై స్పందించారు. ''నేను ఎంతోమందికి సాయం చేశా. వాటి గురించి కూడా ఇప్పటివరకూ ఎక్కడా ప్రస్తావించలేదు. గత 25 ఏళ్లలో మా గ్రామంలో వారి నుంచి ముంబయిలో ఉన్న ప్రజల వరకూ ఎంతోమంది నాకు అండగా ఉన్నారు. నా కెరీర్ ఇన్నేళ్లుగా సజావుగా సాగడమే అందుకు నిదర్శనం. 250 చిత్రాల్లో నటించా. పరిశ్రమ నాకు అండగా నిలవకపోతే ఇన్ని సినిమాలు ఎలా చేయగలను?. ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకు కేవలం రూ.5 కోట్లు చెల్లించడం పెద్ద విషయం కాదు. నేను జైలుకు వెళ్లడానికి ఆ డబ్బు చెల్లించకపోవడం మాత్రమే కారణం కాదు. అదే సమస్య అయితే 2012లోనే ఇది పరిష్కారం అయ్యేది'' అని చెప్పారు. వివాదానికి కారణం గురించి మాట్లాడుతూ.. ''ఒక సినిమా కోసం అప్పటికే రూ.12 కోట్లు ఖర్చు పెట్టాం. మొదట అనుకున్న దానికంటే బడ్జెట్ రూ.22 కోట్లకు చేరింది. దీంతో వివాదం మొదలైంది. ఏ వ్యాపారంలో నైనా ఎదురుదెబ్బలు సహజం. సినిమా పరిశ్రమలో 100 సినిమాలకు 20 మాత్రమే విజయం సాధిస్తాయి. 80 విఫలం అవుతాయి. సినిమాకు ప్రేక్షకాదరణ దక్కకపోయినంతమాత్రాన అందులో మోసం జరిగినట్లు కాదు కదా. నాకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. ఈ పోరాటాన్ని నేను ప్రారంభించలేదు.. కానీ, ముగింపు మాత్రం నేను ఇస్తాను'' అని అన్నారు.



## నెగిటివ్ పాత్రలో డింపుల్ హయాతి?

మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్ లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా పై ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ సినిమాలో బోల్ బ్యూటీ డింపుల్ హయాతి ఓ పాత్రలో కనిపిస్తోందట. ఐతే, ఆమెది హీరోయిన్ పాత్ర కాదు అని, ఓ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో డింపుల్ నటిస్తోందని తెలుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగాస్టార్ సరికొత్త లుక్ లో కనిపించబోతున్నాడు.

పైగా ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని **KVN** ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్ లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.

# ఆ విషయంలో చాలా బాధపడ్డా: మమితా బైజు



'ప్రేమలు' సినిమాతో యువతను అమితంగా ఆకట్టుకున్న మలయాళ నటి మమితా బైజు. ప్రస్తుతం తమిళంలో వరుస సినిమాలు చేస్తున్నారు. విజయ్ హీరోగా తెరకెక్కిన 'జన నాయగన్'లో కీలక పాత్ర పోషించారు. విడుదల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం ఇటీవల ఆన్లైన్ లో లీక్ అయిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలిసి చాలా బాధపడ్డానని మమిత తెలిపారు. ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుందని, అది ఎప్పుడూ వృథా కాకూడదన్నారు. ''జన నాయగన్ లీక్ గురించి నా సోదరుడి ద్వారా తెలిసింది. తొలుత నమ్మలేదు. ఎందుకంటే సోషల్ మీడియాలో వినిపించేవన్నీ వాస్తవాలు కాదు కదా. ఉద్దేశపూర్వకంగా కొందరు ప్రచారం చేస్తున్నారనుకున్నా. కానీ, అది నిజం కావడం దురదృష్టకరం'' అని పేర్కొన్నారు. తాను హీరోయిన్ గా నటించిన 'కర' ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

'కర' గురించి చెబుతూ.. ''ధనుష్ సినిమా కోసం చాలా కష్టపడుతుంటారు. రోజంతా పని చేసినా ఆయన అలసిపోవడం చూడలేదు. పని పట్ల ఎంత నిబద్ధతగా ఉండాలన్నది ఆయన్ను చూసి నేర్చుకున్నా. రొటీన్ పాత్రలకు ఆయనెప్పుడూ దూరంగానే ఉంటారు. ప్రేక్షకులకు కొత్త కథలు, పాత్రలు పరిచయం చేస్తుంటారు. ఆయన సినిమాల్లో 'వీఐపీ' (తెలుగులో రఘువరన్ బీటెక్) బాగా ఇష్టం'' అని తెలిపారు. ధనుష్ హీరోగా విఘ్నేశ్ రాజా తెరకెక్కించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ 'కర' ఈనెల 30న విడుదల కానుంది. తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' లోనూ మమితే హీరోయిన్. ఈ మూవీ స్టోరీ వినగానే ఎంతగానో నచ్చిందని, ఈ ఛాన్స్ మిస్ చేసుకోకూడదనుకుని వెంటనే నటించేందుకు అంగీకరించానని తెలిపారు. మరో తమిళ్ మూవీ, ఓ మలయాళ సినిమాలో ఆమె నటిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.